మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్.

https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 85 | కర్నూలు | మంగళవారం 05-05-202

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi










- మామూలు నటుడి విశ్వరూప ప్రదర్శనం
- ఎంజిఆర్, జయలలిత తరవాత అంతటి విజయం
- సామాన్యుడిగా వచ్చి అసామాన్యుడి ఎదిగిన విజయ్

చెన్నై,మే4(శ్రీచక్ర) : తమిళనాట మామూలు నటుడిగా కనిపించిన వ్యక్తి.. నేడు కోట్ల మంది గొంతుకగా మారి రాజకీయ రంగంలో పెను సంచలనం సృష్టించాడు. అభిమానుల గుండెల్లో 'దళపతి'గా ముద్ర వేసుకున్న జోసెఫ్ విజయ్.. ఇప్పుడు 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే) జన నాయకుడిగా తన కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టేందుకు సిద్ధమయ్యారు. రీల్ లైఫ్ హీరో నుంచి రియల్ లైఫ్‌లో రాజకీయ నాయకుడిగా ఎంట్రీలోనే ప్రభంజనం సృష్టిం చారు విజయ్. గతంలో ఎంజిఆర్, జయలిత తరవాత ఇప్పుడు విజయ్ ఆ దిశగా ప్రయాణం మొదలయ్యిందనే చెప్పాలి. రాజకీయాల్లోకి రావాలని రజనీకాంత్ అనుకుని వెనకడుగు వేశారు. కమలహాసన్‌కు కలిసి రాలేదు. 1974 జూన్ 24న విజయ్ జన్మించారు. తల్లి శోభ గాయని, తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ దర్శకుడు. తొలినాళ్లలో కనీసం బాత్రూమ్ కూడా లేని చిన్న గదిలో విజయ్ తల్లిదండ్రులు నివాసం ఉండేవారు. అతడికి ఏడేళ్లు వచ్చేవరకు ఆర్థికంగా సతమతమవుతూనే ఉండేది ఆ కుటుంబం. ఆ తర్వాతే విజయ్ తల్లిదండ్రులు విజయ్‌కాంత్‌తో 'చట్టం ఒరు ఇరుట్టరై' తీశారు. ఈ సినిమా సూపర్ హిట్ అయింది. దీంతో వీరు ఆర్థికంగా స్థిరపడ్డారు. విజయ్ చిన్నప్పుడు చాలా అల్లరి చేసేవాడు. ఎప్పుడూ నవ్వుతూ, అందరినీ ఆట పట్టించేవాడు. కానీ, ఆయన సోదరి మరణం విజయ్ జీవితాన్ని మార్చేసింది. తన చెల్లి విద్య అంటే విజయ్‌కు ప్రాణం. ఆమె చనిపోయిన తర్వాత విజయ్ ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయారు. నేటికీ ఆయన తెరపై అంత ఎనర్జీతో కనిపిస్తున్నా.. బయట మాత్రం చాలా మితభాషిగా ఉండటానికి ఆనాటి విషాదమే కారణమని విజయ్ తండ్రి చంద్రశేఖర్ చెబుతుంటారు. చిన్నప్పటి నుంచి తండ్రిని చూసిన విజయ్ దృష్టి సినిమాల వైపు మళ్లింది. కానీ, 'మీవాడు హీరో ఏంటండీ, అసలు నటుడిగానే పనికిరాడు... బండమొహం వాడిది!' అంటూ ఎవరూ అవకాశాలు ఇవ్వలేదు. దీంతో రూ.60లక్షలు అప్పు చేసి విజయ్ తండ్రే దర్శకుడిగా ఆయనతో సినిమా తీశారు. అలా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఎన్నో ఆశలతో సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్‌కు తొలి ప్రయత్నంలో నిరాశే ఎదురైంది. తొలి సినిమా 'నాళయ తీర్పు' ఫ్లాప్. రెండు నెలలు కనీసం ఫ్రెండ్స్‌ను కలవడానికి కూడా విజయ్ బయటకు వెళ్లలేదు. చివరకు ఆ స్నేహితులే విజయ్‌కు అండగా నిలబడ్డారు. ఆయనలో ధైర్యం నింపారు.తనను తాను నిరూపించుకోవాలనుకున్న విజయ్.. డ్యాన్స్ పైన కసరత్తు మొదలుపెట్టాడు. కరాటే నేర్చుకున్నాడు. పగలూ, రాత్రీ ఇంకే ధ్యాస లేకుండా సాధన చేశాడు. ఆ తర్వాత సరికొత్త విజయ్‌గా 'రసిగన్' అనే సినిమా చేశాడు. 1994లో విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఒకప్పుడు విమర్శించినవాళ్లే.. శెభాష్ అంటూ మెచ్చుకున్నారు. 1990 చివర్లో, 2000 ప్రారంభంలో విజయ్ సినీరంగాన్ని శాసించారు. 'ఖుషి', 'గిల్లి' వంటి సినిమాలతో సూపర్ హిట్‌లు అందుకున్నారు. అప్పుడే అందరూ విజయ్‌ను 'ఇళయ దళపతి' అని పిలవడం ప్రారంభించారు. అనతికాలంలోనే ఆ పేరు దళపతిగా మారింది. విజయ్ నటించిన 'అదిరింది', 'సర్కార్', 'విజిల్', 'మాస్టర్' వంటి సినిమాలు ఆయన్ని ప్రేక్షకులకు మరింతగా చేరువ చేశాయి. ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకున్న విజయ్.. వారికి సేవ చేయాలని రాజకీయ రంగంలోకి ప్రవేశించారు. 2024 ఫిబ్రవరి 2న 'తమిళగ వెట్రి కజగం' స్థాపించారు. ఈ పార్టీ ప్రారంభించాక 'లియో' ఆడియో రిలీజ్‌లో విజయ్ చేసిన వ్యాఖ్యలు ఆయనకు అభిమానులంటే ఎంత ప్రేమో తెలియజేశాయి. 'నాపై ఇంత అభిమానం చూపుతున్న మీకు ఏదైనా తప్పకుండా చేయాలనుంది. చేస్తా. మీ కాలికి చెప్పులా ఉండటానికి కూడా వెనకాడను. ఇప్పుడేం జరిగినా పట్టించుకోకుండా అందరూ ఓపికగా ఉండండి. విజయాన్ని అందుకోవచ్చు' అన్నారు. నాడు చెప్పినట్లు గానే నేడు విజయాన్ని అందుకున్నారు.

# మోడీ నాయకత్వానికి ప్రజల మద్దతు

## ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు నాయుడు



అమరావతి,మే4(శ్రీచక్ర) : ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో ఎన్డీఏ అభ్యర్థులు ముందంజలో కొనసాగుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వానికి మద్దతు తెలుపుతున్నారని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల ట్రెండ్‌ను పరిశీలిస్తే ఎన్డీఏ అభ్యర్థుల ప్రదర్శన స్పష్టంగా కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. ప్రజల్లో మోదీపై విశ్వాసం తగ్గలేదని, మరింతగా పెరిగిందని అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి దిశగా కేంద్రప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల కు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే 'వికసిత భారత్' లక్ష్యానికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ దిశగా కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని తెలిపారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా అమలవుతోందని సీఎం కొనియాడారు. అభివృద్ధి ఫలాలు ప్రతివర్గానికీ అందేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమిని మరింత ఐక్యంగా, బలంగా మారుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత ఫలితాలు మోదీ నాయకత్వంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని, 'వికసిత భారత్' దార్శనికతకు ఇది బలమైన మద్దతని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 'సబ్ కా సాథ్' స్ఫూర్తితో దూసుకెళ్తున్న ఎన్డీఏ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ మరింత బలోపేతం అవుతుందని ఉద్ఘాటించారు.

# ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి: ప్రధాని మోదీ

పశ్చిమబెంగాల్‌మే4(శ్రీచక్ర) బీజేపీకి విజయం ఖరారైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. రాష్ట్ర బీజేపీ కార్యకర్తలను అభినందించారు. వారి కఠోర శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని చెప్పారు. మంచి పాలన అందించాలన్న బీజేపీ అభిమతమే అంతిమంగా పైచేయి సాధించిందని చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.పశ్చిమ బెంగాల్ ప్రజలు బీజేపీకి అద్భుతమైన విజయాన్ని అందించారని ప్రధాని మోదీ అన్నారు. ఈ విజయం కోసం రాష్ట్రంలో పార్టీకి చెందిన కొన్ని తరాల కార్యకర్తలు నిరంతరం శ్రమించారని ప్రశంసించారు. కొన్నేళ్ల పాటు క్లిష్ట పరిస్థితుల్లో పోరాడారని అన్నారు.



కార్యకర్తలే పార్టీ శక్తి అని కొనియాడారు. ప్రతి ఒక్క కార్యకర్తకూ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు.బీజేపీకి మర్చిపోలేని విజయం అందించినందుకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ తాను శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని కూడా ప్రధాని మోదీ చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆశలను, కలలను సాకారం చేసేందుకు బీజేపీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ అవకాశాలు, గౌరవం దక్కేలా పాలన అందిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.




**అద్దంకి నుంచి 92 కి.మీ. మేర హైస్పీడ్ యాక్సెస్ కంట్రోల్ రోడ్డు**

**బెంగళూరు, చెన్నైలకు వేగంగా చేరుకునేలా ఎన్‌హెచ్ 16 విస్తరణ**


**6 నుంచి 12 లేన్లకు విస్తరించే చాన్స్**

**నాలుగైదు చోట్లే ఎంట్రీ, ఎగ్జిట్లు**

**టూ వీలర్లు, ఆటోలకు నో ఎంట్రీ**

**రెండేళ్లలో పూర్తే లక్ష్యం**

గుంటూరుమే4(శ్రీచక్ర) రాష్ట్ర రాజధాని అమరావతితో దేశంలోని ప్రధాన నగరాల అనుసంధానానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. దక్షిణాదిలో ముఖ్య నగరాలైన చెన్నై, బెంగళూరుల నుంచి వేగంగా చేరుకునేందుకు హైస్పీడ్ యాక్సెస్ కంట్రోల్ హైవే నిర్మాణానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆ రెండు ప్రధాన నగరాల నుంచి వచ్చే వాహనాల ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రకాశంజిల్లా అద్దంకి నుంచి అమరావతి వరకూ 92 కి.మీ. మేర హైస్పీడ్ యాక్సెస్ కంట్రోల్ హైవేగా మారుస్తున్నారు. ఈ హైవేను రెండేళ్లలో పూర్తిచేసే లక్ష్యంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు అడుగులు వేస్తున్నారు. అవసరమైన భూమి అందుబాటు, సేకరణ తదితర అంశాలకు సంబంధించి రెవెన్యూ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. అమరావతికి ఇప్పటికే చెన్నై–కోల్‌కతా హైవే (ఎన్‌హెచ్–16)లో నిర్మించిన విజయవాడ వెస్ట్‌బైపా?సతో నేరుగా చెన్నైకి కనెక్టివిటీ ఏర్పడింది. ఎన్‌హెచ్ 65 ద్వారా



హైదరాబాద్‌తోనూ కనెక్టివిటీ ఉంది. బెంగళూరుతో అమరావతిని కూడా నేరుగా కలిపేందుకు వీలుగా ఈ కొత్త ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా బెంగళూరు–కడప–విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవేలో అద్దంకి నుంచి అమరావతి వరకు హైస్పీడ్ యాక్సిస్ కంట్రోల్ రోడ్డు నిర్మిస్తారు. బెంగళూరు–విజయవాడ హైవే ప్రకాశం జిల్లా అద్దంకి దగ్గర ఉన్న ముప్పవరం వద్ద ఎన్‌హెచ్–16లో కలుస్తుంది. ఎన్‌హెచ్–16నే కొత్త ప్రాజెక్టులో భాగంగా హైస్పీడ్ యాక్సెస్ కంట్రోల్ హైవేగా మార్చనున్నారు. ప్రస్తుత హైవేలో అద్దంకి నుంచి అమరావతి మధ్య 36చోట్ల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉన్నాయి. వీటిద్వారా ఆటోలు, ద్విచక్ర వాహనాలు హైవేలోకి వచ్చి ట్రాఫిక్ రద్దీ పెరిగి రాకపోకల వేగం తగ్గుతోంది.అందువల్ల ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలను నియంత్రించేలా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను కుదిస్తారు. ముప్పవరంలో ఒకచోట, ఓఆర్ఆర్‌తో అనుసంధానమయ్యే నారా కోడూరు, గుంటూరు నగరం, చిన్నకాకాని జంక్షన్ వద్ద.. ఇలా నాలుగైదు చోట్ల మాత్రమే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఇస్తారు. తద్వారా ఎక్స్‌ప్రెస్ వాహనాల రాకపోకలను సరళతరం చేస్తారు.

# ఎన్డీయే ఆధిక్యం.. ఏపీలో బీజేపీ నేతల సంబరాలు

విజయవాడ, మే4(శ్రీచక్ర) దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. పశ్చిమబెంగాల్, అస్సాంలో ఎన్డీఏ అభ్యర్థులు ఆధిక్యంలో దూసుకెళ్తున్నారు. దీంతో ఏపీ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు స్వీట్స్ పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో చారిత్రక ఫలితాలు వచ్చాయన్నారు. అస్సాంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని వెల్లడించారు. వెస్ట్ బెంగాల్లో ప్రజలు స్పష్టమైన తీర్పును ఇచ్చారని తెలిపారు. ఆటవిక పాలనకు చెక్ పెట్టి బెంగాల్ ప్రజలు తీర్పునిచ్చారని అన్నారు.తమిళనాడులో రెండో స్థానంలో ఎన్డీయే కూటమి ఉందని.. కేరళలో కూడా స్పష్టమైన ఓట్ షేర్ బీజేపీకి వచ్చిందని మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో ఎన్నికలు జరిగిన ప్రతిసారి కమ్యూనిస్టు, కాంగ్రెస్ పార్టీలు బీజేపీని ఓడించాలని చేతులు కలిపాయని విమర్శించారు. కేరళంలో మాత్రం కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు వేరుగా పోటీ చేస్తున్నాయన్నారు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. సబ్ కా ప్రయాస్' పేరుతో బీజేపీ అడుగులు వేస్తోందన్నారు. పశ్చిమ, తూర్పు, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీకి ప్రజలు పట్టం కడుతున్నారని తెలిపారు. 12 ఏళ్లుగా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు.. బీజేపీ గెలుపుకు దోహదం చేస్తున్నాయని వెల్లడించారు.



# సంపాదకీయం

## ఓటర్ విలక్షణ తీర్పు...

అధికారంలో ఉన్న పార్టీలు.. అభివృద్ధిని చేసి చూపించాలి. అంతేగానీ.. సంక్షేమ పథకాలు ఇస్తే సరిపోదు. ప్రజలు అలాంటి పార్టీలను తిరస్కరిస్తున్నారు బెంగాల్‌లో మోదీ ఎన్నికలకు ముందు.. మహిళల అకౌంట్లలో మనీ వేశారు. దాంతో మహిళల ఓట్లు తమకే అనుకున్నారు. అడ్డంగా ఫెయిల్ అయ్యారు. ఏపీలో వైసీపీ కూడా పథకాల ద్వారా గెలుస్తామని అనుకుంది. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. తమిళనాడులో డీఎంకే కూడా ఇలాగే దెబ్బైపోయింది. తెలంగాణలో బీఆర్ఎస్ కంటే.. ఎక్కువ పథకాలను ప్రకటించిన కాంగ్రెస్‌ని ప్రజలు గెలిపించారు. ఏపీలోనూ అదే జరిగింది. ప్రజలు పథకాలు ఎవరైనా ఇస్తారు.. ఎవరు ఎక్కువ ఇస్తే వారికే ఓటు అంటున్నారు. అదే సమయంలో.. పథకాలు మాత్రమే ఇస్తే, అలాంటి పాలనకు స్వస్తి పలుకుతున్నారు. అందువల్ల ఓటర్లను తక్కువ అంచనా వేసే పార్టీలకు పాకులు తప్పట్లేదు. తాజా ఫలితాలు ఇదే తెలియజేస్తున్నాయి. ప్రతీ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటాయి. అవి జాతీయ పార్టీలను ఎట్టి పరిస్థితుల్లో అధికారానికి రానివ్వకుండా చూసుకుంటాయి. కానీ.. కొన్నేళ్లుగా ఈ పరిస్థితి మారుతోంది. ముఖ్యంగా కేంద్రంలో నరేంద్ర మోదీ సారధ్యంలో బీజేపీ, ఎన్డీయే సర్కార్ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రాంతీయ పార్టీలు గల్లంతవుతున్నాయి. ఇందుకు బీజేపీ వ్యూహాలు ఒక కారణమైతే, ఆ పార్టీల స్వయంకృత అపరాధాలు మరో కారణం. జమ్మూకాశ్మీర్‌లో ఎన్సీ, హర్యానాలో ఒడిశాలో బిజూ జనతదళ్, పంజాబ్‌లో శిరోమణి అకాళీదళ్, బెంగాల్‌లో తృణమూల్, కర్ణాటకలో జేడీఎస్, మహారాష్ట్రలో శివసేన ఇలా ఎన్నో ప్రాంతీయ పార్టీలు.. తమ ఉనికిని కోల్పోతున్నాయి. అధికారానికి దూరమై, కనీసం ప్రతిపక్షాలుగా కూడా ప్రభావం చూపలేకపోతున్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా ప్రభావం చూపలేకపోతోంది. మరికొన్ని సందర్భాల్లో.. బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలు బలహీనపడుతున్నాయి. ఇక్కడ బీజేపీ తన ఎదుగుదలకు పునాదిని నిర్మించుకుంటోంది. అది ఆ పార్టీలకు సమస్య అవుతోంది. కచ్చితమైన విధానాలు, సిద్ధాంతాలు, పట్టుదల, బలమైన వ్యూహాల వంటివి కమలం ఎదుగుదలకు కారణం అవుతున్నాయి. మొన్నటిదాకా బీహార్‌లో బలంగా ఉన్న జేడీయూ.. ఇప్పుడు బీజేపీకి అధికారాన్ని అప్పగించుకుంది. ఐతే.. సౌత్‌లో మాత్రం బీజేపీ పెనట్రేట్ అవ్వలేకపోతోంది. కర్ణాటక తప్పితే.. మిగతా రాష్ట్రాల్లో ప్రభావం చూపలేకపోతోంది. భాషా ప్రాంతీయతా భావం ఇక్కడ బలంగా ఉండటం కమలానికి సవాల్ అవుతోంది. అయినప్పటికీ.. దేశవ్యాప్తంగా ఆ పార్టీ విస్తరిస్తున్న తీరు మాత్రం.. సంచలనమే.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఒక కొత్త విషయాన్ని గ్రహించవచ్చు. ఏపీలో జనసేన పార్టీ ఒంటరిగా పోటీ చెయ్యకుండా.. టీడీపీతో కూటమిగా పోటీ చేసి.. గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ పొత్తు వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలలేదు. కానీ తమిళనాడులో విజయ్ ఇలా చెయ్యలేదు. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. దాంతో.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలినా.. ఎక్కువ ఓట్లు తనకే దక్కేలా చేసుకున్నారు. ఫలితంగా సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఇప్పుడు టీవీకే అవతరించింది. మెజార్టీ మార్క్ రాకపోయినా.. మరో 10 సీట్లతో పవర్ లోకి వచ్చేయవచ్చు. ఇందుకోసం చిన్న చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకోవచ్చు. ఇలా ఒంటరిగా పోటీ చేసి బలమైన పార్టీగా ఎదగడం వల్ల ఇప్పుడు టీవీకే.. సొంతంగా అధికారంలోకి వచ్చే పరిస్థితిని తెచ్చుకుంది. ఈ ఛాన్స్ జనసేన తెచ్చుకోలేకపోయింది.ఏపీలో ఇప్పుడు జనసేన.. రెండో పెద్ద పార్టీగా ఉంది. కానీ.. టీడీపీతో పోల్చితే.. జనసేనకి ఉన్నవి 21 సీట్లే. నెక్ట్స్ ఎన్నికల్లో ఆ పార్టీ బలంగా ఎదగాలంటే.. ఒంటరిగా పోటీ చెయ్యాల్సి ఉంటుంది. కానీ.. 15 ఏళ్లు పొత్తుతోనే వెళ్తామని చాలాసార్లు డీసీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. అలా పొత్తుతో వెళ్లినంతకాలం.. జనసేన ఎదిగే అవకాశాలు ఉండవు. సీట్ల సర్దుబాటులో.. కొన్ని సీట్లతోనే సర్దుకోవాల్సి ఉంటుంది. అలాగే పవన్ కళ్యాణ్ సీఎం అయ్యే చాన్స్ కూడా మిస్సవుతుంది. అందుకే విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా.. ఇప్పుడు సీఎం అయ్యే ఛాన్స్ పొందారు. ఇదే జనసేనకి మైనస్ అవుతుంటే.. విజయ్‌కి ప్లస్ అయ్యింది. అఫ్‌కోర్స్ తమిళ పాలిటిక్స్ వేరు, మన ఏపీ పాలిటిక్స్ వేరు.. కానీ పరిస్థితులు అలా అయ్యాయని అనుకోవచ్చువిజయ్ వంటి కొత్త నాయకుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టడం, ఆయన పార్టీకి వచ్చిన ఆధిక్యాలు చూస్తే, సహజంగానే అందరి దృష్టి పడింది. దీని నుంచి అనుభవజ్ఞులైన నాయకులు సైతం గమనించగల కొన్ని విస్తృత రాజకీయ పాఠాలు ఉన్నాయి.ముఖ్యమైన పాఠాలలో ఒకటి కథనం, భావోద్వేగ అనుబంధ శక్తి. విజయ్ పట్ల ఆదరణకు కారణం, సంవత్సరాల తరబడి జాగ్రత్తగా తీర్చిదిద్దుకున్న తెరపై ఆయన ఉనికి. ఇది పెద్ద సంఖ్యలో మద్దతుదారులతో ఒక సిద్ధమైన భావోద్వేగ బంధంగా రూపాంతరం చెందింది. సినిమాల్లో ఆయన చెడును ప్రశ్నించే ధోరణి.. ప్రభుత్వాలకు ముఖ్యంగా బీజేపీకి వ్యతిరేకంగా నడుచుకునే ధోరణి.. ప్రాంతీయ తత్వం, ద్రవిడ వాదాన్ని బలపరిచింది. బీజేపీని వ్యతిరేకించేవారికి.. విజయ్ బలమైన సపోర్టర్‌గా నిలిచాడు.మరొక అంశం ప్రసంగాలు. విజయ్ ప్రసంగాలన్నీ దూకుడుగా, సూటిగా, నత్తిలేకుండా సాగాయి. అలాగే.. ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోశాయి. పూర్తిగా డీఎంకేని బలంగా టార్గెట్ చేశారు. దాంతో డీఎంకేని వ్యతిరేకించేవారికి.. విజయ్.. బలమైన ఆల్టర్నేట్‌గా కనిపించాడు. అదే సమయంలో అన్నాడీఎంకే.. అంతర్గత కల్లోలాలతో.. బలమైన నాయకత్వాన్ని ప్రజలకు చూపలేకపోయింది. దీంతో.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు.. టీవీకేకి షిఫ్ట్ అయ్యింది

# దివ్యాంగుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం:జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) నూరుల్ ఖమర్

**ఇంద్రధనస్సు పథకాలతో విభిన్న ప్రతిభావంతులకు నూతన అవకాశాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి**





కర్నూలు, మే, 04 (శ్రీచక్ర): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం, సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) నూరుల్ ఖమర్ పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఆవరణంలో విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటార్ సైకిల్ వాహనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, మూడు చక్రాల మోటార్ సైకిల్ వాహనాలను ప్రజా ప్రతినిధులతో కలిసిజిల్లా కలెక్టర్ (ఇంచార్జి) పంపిణీ చేశారు. జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. సాధారణ వ్యక్తుల మాదిరిగానే దివ్యాంగులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో మూడు చక్రాల మోటార్ సైకిల్ లను 70 మందికి మంజూరు చేసి ప్రతి నియోజకవర్గానికి 10 మందికి చొప్పున పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన 54 మందికి కూడా త్వరితగతిన వాహనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందరికీ సమానంగా చేరేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, దివ్యాంగుల హక్కులను పరిరక్షించేందుకు 1993 మరియు 2016 చట్టాల ప్రకారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. "సుభయాన్?అభయాన్" కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో అవసరమైన సౌకర్యాలు లేకపోతే తెలియజేస్తే వెంటనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగుల సంఘం నుంచి వచ్చిన ప్రతిపాదన మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమస్యలపై చర్చించేందుకు సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించేందుకు అంగీకరించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల చట్టాలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలో మిషన్ మోడ్‌లో ఖాళీలను భర్తీ చేయడంతో పాటు కారుణ్య నియామకాల ద్వారా కూడా దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని తెలిపారు. అయితే నోటిఫికేషన్లకు ఎక్కువగా పట్టణ ప్రాంతాల నుంచే దరఖాస్తులు వస్తుండగా, గ్రామీణ ప్రాంతాల నుంచి తక్కువగా వస్తున్నాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామ స్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తే వారు కూడా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జరగడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు కలిపి 70 వాహనాలు అందించడం ద్వారా లబ్ధిదారులకు ఉపాధి, స్వావలంబనకు మార్గం సుగమమవుతుందని తెలిపారు. ఒక్కో వాహనం సుమారు లక్ష రూపాయల విలువ కలిగినదని చెప్పారు. దివ్యాంగత్వం శరీరానికే పరిమితం, మనసుకు కాదని, సరైన ప్రోత్సాహం ఉంటే వారు అన్ని రంగాల్లో రాణించగలరని ఆమె స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతోనే ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం "ఇంద్రధనస్సు" కార్యక్రమం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, ఎక్స్ అఫీషియో సభ్యత్వం వంటి పలు ప్రయోజనాలను అందిస్తున్నదని వివరించారు. దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో పెన్షన్లు పెంచి పంపిణీ చేస్తున్నామని, గతంలో ?200గా ఉన్న పెన్షన్‌ను ?6000 వరకు పెంచిన ఘనత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అంతేకాకుండా, లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే పెన్షన్ అందించే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎక్కడ చదువుకుంటున్నారో అక్కడే వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విద్య అందించాలని, విద్య ద్వారానే భవిష్యత్తు మార్పు సాధ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రజలకు పాణ్యం ఎమ్మెల్యే ఆకాంక్షించారు.రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల చైర్మన్ నారాయణస్వామి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో దివ్యాంగులకు సంబంధించిన బ్లాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. డిసెంబర్ 3న రాష్ట్రవ్యాప్తంగా "దివ్యాంగుల వారోత్సవాలు" ప్రకటించడం ద్వారా వారికి గౌరవం, గుర్తింపు కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కల్పించడం వంటి చర్యలు తీసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15,000 మంది దివ్యాంగులు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్నారని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులు ఎక్కడ చదువుకుంటున్నారో అక్కడే వారికి పెన్షన్ అందే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధిక పెన్షన్లు అందిస్తున్నామని, దివ్యాంగులకు రూ.6,000, డయాలసిస్ పేషంట్లకు రూ.10,000, మంచానికే పరిమితమైన రోగులకు రూ.15,000 పెన్షన్ అందిస్తున్నామని వెల్లడించారు. దివ్యాంగులకు అవసరమైన ల్యాప్‌టాప్‌లు, టచ్ ఫోన్లు అందిస్తూ వారి విద్య, ఉపాధికి ప్రోత్సాహం కల్పిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తించి, దానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఏ సమస్య వచ్చినా విభిన్న ప్రతిభావంతుల చైర్మన్‌గా ఎప్పుడూ మీకు తోడుగా ఉంటానని, మీ కోసం పనిచేస్తానని నారాయణస్వామి భరోసా ఇచ్చారు. పేద ప్రజల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం, పెన్షన్ల పెంపు వంటి పథకాలను అమలు చేస్తోందని కుడా చైర్మన్ సోమశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. దివ్యాంగులకు సీఎం నారా చంద్రబాబు నాయుడు సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. పేదల సేవకే మంత్రి టీజీ భరత్ రాజకీయాల్లోకి వచ్చారని, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఆయన లక్ష్యమని పేర్కొన్నారు.టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ... దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యలను గుర్తించిన చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో బస్సుల్లో ఉచిత ప్రయాణం, పెన్షన్ల పెంపు వంటి పథకాలతో పాటు జిల్లాలో 70 మూడు చక్రాల మోటార్ సైకిళ్లను పూర్తిగా ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఒక్కో వాహనం లక్షల రూపాయల విలువ కలిగి ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని ఉచితంగా అందజేస్తోందని చెప్పారు. సమాజంలో దివ్యాంగులకు గౌరవం పెంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, భవిష్యత్తులో ఏ కష్టం వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజలు తమ అండదండలు, ఆశీర్వాదాలు కొనసాగించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు మెగా కీ తో పాటు మూడు చక్రాల మోటార్ సైకిల్ వాహనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాయిస్ ఫాతిమా, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ కే. లక్ష్మీనారాయణ, కర్నూలు తెలుగుదేశం కమిటీ అధ్యక్షులు రవికుమార్, జనసేన రాష్ట్ర విభిన్న ప్రతిభవంతుల నాయకులు నాగరాజు, జిల్లా టిడిపి సాంస్కృతి విభాగపు అధ్యక్షులు పి. హనుమంతరావు చౌదరి , తెలుగుదేశం కార్యదర్శి నాగరాజు, విభిన్న ప్రతిభావంతుల నాయకులు సురేష్ నాయుడు, ఈరన్న ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

# బస్తిపాడు గ్రామ పొలిమేరలోని సమాధుల పల్లెలో కోట్ల విలువైన గ్రామకంఠం భూమిపై టిడిపి నాయకుల అక్రమ కబ్జాయత్నాన్ని అరికట్టాలి :వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కల్లూరు మండల నాయకులు



కల్లూరు, మే 4 (శ్రీచక్ర): బస్తిపాడు గ్రామ పొలిమేరలోనీ సమాధుల పల్లెలో కోట్ల విలువైన గ్రామకంఠం భూమిపై టిడిపి నాయకుల అక్రమ కబ్జాయత్నాన్ని అరికట్టాలి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కల్లూరు మండల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మీడియా సమావేశంలో బస్తిపాడు కల్లా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సమాధుల పల్లె గ్రామంలో భూముల కబ్జా వ్యవహారం పై మీడియా సమావేశం నిర్వహించారు. సర్వే నెంబర్ 382లో ఉన్న సుమారు 1.93 ఎకరాల భూమిని టిడిపి నాయకులు అక్రమంగా ఆక్రమిస్తూ సాగు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, కలెక్టర్ కి గ్రీవెన్స్ కు వెళ్లిన చర్యలు లేకపోవడంతో, మా నాయకుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామ భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సామాదుల పల్లె భూమిని పరిశీలించి పత్రిక సమావేశం నిర్వహించారు..స్థానిక రైతులతో గొడవలు, బెదిరింపులు చేసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. టిడిపి నాయకులు మా ప్రభుత్వం వచ్చింది కాబట్టి మేము సాగు చేస్తాం అనే ధోరణిని ఖండించారు. భూమిని లెవలింగ్ చేయడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటో తెలుసని, ఇది డైవర్షన్ రాజకీయాలేనని విమర్శించారు. నాగరాజు తదితరులు ఈ వ్యవహారాల్లో ప్రధాన బాధ్యులని పేర్కొంటూ, వెంటనే అధికారులతో సర్వే నిర్వహించి నిజాలను ప్రజలకు ముందు ఉంచాలని సవాల్ విసిరారు. గ్రామ ప్రజల హక్కులను కాపాడేందుకు చివరి వరకు పోరాడుతామని వైఎస్సార్సీపి నాయకులు స్పష్టం చేశారు. మార్కాపురం సర్పంచ్ మద్దిలేటి మాట్లాడుతూ నిన్నటి రోజున టిడిపి మండల అధ్యక్షులుగా ఉన్న రామాంజనేయులు మాట్లాడుతూ మా మార్కాపురం గ్రామంలో స్మశానం 87 బిలో 47 సెంట్లు వారి కుటుంబ సభ్యులు అక్రమంగా రిజిస్టర్ చేసుకున్నారు అది నిజమా కాదా చెప్పు అని నిలదీశారు. నువ్వు నిజాయితీపరుడు అని అంటున్నావు కదా మరి దీనికి సమాధానం చెప్పు అని వారు బదులిచ్చారు. మండల మీటింగ్లో ఎమ్మెల్యేని అడిగాను మా గ్రామంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎమ్మార్వో దృష్టికి తీసుకొచ్చి చూపించాను ఒకసారి వెరిఫికేషన్ చేయండి అని చెప్పాను కానీ ఇటువంటి లాభం లేకుండా పోయింది. మా నాయకుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డికి మీద మాట్లాడడం పద్ధతి కాదు అని అన్నారు. నువ్వు ఎంతవరకు నిజాయితీగా ఉన్నావు అనేది నీ మనస్సాక్షిని అడుగు.. ఈరోజు లేదా రేపు ఎమ్మార్వోని మీరే పంపండి మా గ్రామానికి మా గ్రామంలో సర్వే నంబర్ 87ః ఎంతమంది రిజిస్టర్ చేసుకున్నారో డాక్యుమెంట్ 280,82,83,84,85. 64వ సర్వే నంబర్ పెద్ద కొట్టాల పోయే రోడ్డులో ఉంటే 77 అని నువ్వు దొంగ రిజిస్టర్ చేశావు.. నీవు నిజాయితీగా ఉంటే స్మశానానికి గాని వాటర్ ట్యాంక్ గాని నాయకుడని నువ్వు అంటున్నావు కదా డెవలప్మెంట్ చేసే ఉద్దేశం నీకుందా అని ప్రశ్నించారు. చిన్నటేకూరు ఈశ్వరయ్య మాట్లాడుతూ 382 సర్వే నంబర్ భూమి వివాదంపై అసలు నిజాలు బయటపెట్టాలన్నారు. మాటలు కాదు? ఆధారాలతో మాట్లాడుతున్నాం...388, 382 సర్వే నంబర్ల భూములపై జరుగుతున్న అన్యాయాన్ని ఇక దాచిపెట్టలేరు...మా బావ శ్రీధర్ గారికి 388 సర్వే నంబరులో దాదాపు 20 ఎకరాలకు పైగా భూమి ఉంది.మా మామ కొనుగోలు చేసిన 11 ఎకరాల్లో ఇద్దరు అన్నదమ్ములకు సమానంగా ఐదున్నర ఎకరాలు రావాల్సిన చోటరికార్డుల్లో మాత్రం 5 ఎకరాలు 43 సెంట్లు మాత్రమే చూపిస్తున్నారు.అదే అనుభవంలో (గ్రౌండ్‌లో) అయితే 4 ఎకరాలు 93 సెంట్లు మాత్రమే ఉంది.ఇది ఎవరి నిర్లక్ష్యం?ఇది ఎవరి అక్రమం?రామాంజనేయులు మీరు వైసీపీ నాయకులపై ఆరోపణలు చేస్తున్నారు. కానీ అసలు నిజం ఏంటంటే? బాధితుడు మీ పార్టీ కార్యకర్తే, మన బీసీ సమాజానికి చెందిన వ్యక్తే..బీసీ నాయకుడిగా మీరు మాట్లాడే ముందు..బీసీ రైతుకు జరుగుతున్న అన్యాయం కనిపించలేదా?మా వాళ్లు ఎక్కడైనా ఒక సెంటు భూమి ఎక్కువగా ఆక్రమించి ఉంటే?అది మా హక్కు కాదని చెబుతున్నాం.అవసరమైతే చెట్లు తొలగించడానికి కూడా సిద్ధంగా ఉన్నాం..అంత నమ్మకంతో మాట్లాడుతున్నాం. రేపే ఎమ్మార్వో, సర్వేయర్‌ను పిలిపించి, రెండు పార్టీల సమక్షంలో సరిహద్దులు నిర్ణయించాలి...నేను బంధువుగా వస్తా? మీరు పార్టీ కార్యకర్తగా రండి? కలిసి నిజం బయటపెట్టుదాం. సమాధులపల్లె గ్రామ కంఠం గురించి మీరు చెప్పిన మాటలు కూడా వాస్తవాలకతీతం. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఒక్కఅడుగుకూడా కబ్జాజరగలేదు. అయితే 2014 తర్వాత 22 ఎకరాల్లో సాగులో ఉన్న రైతుల భూములను మార్చి, నిజమైన రైతుల పేర్లు తీసేసి, ఇతరుల పేర్లకు మార్చిన ఘటనలు జరిగాయి.

# సత్పురుషుల సాంగత్యమే జీవితానికి సార్థకత :శ్రీనివాస రామానుజ దాసు



కర్నూలు, మే, 04 (శ్రీచక్ర): మహనీయులను ఆశ్రయిస్తే మనసు శుద్ధిపడి, పవిత్రులవుతారని అందుకే అనాది నుండి గురుశిష్య పరంపర కొనసాగుతూ మానవుడు తన్నుతాను ఉద్ధరించుకోవడం జరుగుతుందని గుంటూరు జిల్లా, నంబూరు ఆశ్రమం పౌరాణికులు, మధుర వాచస్పతి శ్రీనివాస రామానుజదాసు అన్నారు. కర్నూలు నగరంలోని శ్రీ భరతమాత ఆలయంనందు జరుగుతున్న సుందరకాండ ప్రవచన సప్తాహంలో భాగంగా నాలుగవరోజు ప్రవచనం కొనసాగించారు. ముందుగా ప్రవచనకర్తకు శేషవస్త్రంతోపాటు పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత విష్ణుసహస్రనామ సాంస్కృతిక సమాఖ్య ఉపాధ్యక్షులు మల్లెల పెద్ద పుల్లారెడ్డి, భరతమాత సేవా సమితి సహకార్యదర్శి కార్యవర్గ సభ్యులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. శివశంకర్ రెడ్డి, చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, లావణ్య, శకుంతల, పద్మావతి, కాత్యాయనీ, శ్రీలక్ష్మి, వసుంధరమ్మ, ప్రమీల, రత్నమ్మ తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ప్రజలకు ఉచిత ఇసుక అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

**మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి**



కర్నూలు, మే 4 (శ్రీచక్ర): కర్నూలు జిల్లా నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి సోమవారం జాయింట్ కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కల్లూరు మండలం పెద్దటేకూరు పంచాయితీ దొడ్డిపాడు గ్రామానికి చెందిన రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. దొడ్డిపాడు గ్రామ రైతులు భూ సంబంధిత, సాగునీటి, పంట నష్టపరిహారం వంటి పలు సమస్యలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రైతులు పలుమార్లు అధికారులు చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడం బాధాకరమని, రైతుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాటసాని రామభూపాల్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుక అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న విధానానికి విరుద్ధంగా పాణ్యం నియోజకవర్గ పరిధిలో కొందరు వ్యక్తులు ఇసుక రవాణాను అడ్డుకుని, డంపుల్లో నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని, ఇలాంటి అక్రమాలు సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని కాటసాని గారు స్పష్టం చేశారు. ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకుని కర్నూలు జిల్లాల్లో ఎటువంటి అడ్డంకులు లేకుండా ప్రజలకు ఉచిత ఇసుక అందేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దటేకూరు గ్రామ నాయకులు హనుమంత రెడ్డి దొడ్డిపాడు గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాత్రి వేళల్లో విజిబుల్ పోలీసింగ్ కట్టుదిట్టం నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు





కర్నూలు, మే 4 (శ్రీచక్ర): జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేరాల నియంత్రణతో పాటు అనుమానాస్పద వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఆదివారం రాత్రి నుండి తెల్లవారు జాము వరకు కర్నూలు నాల్గవ పట్టణ సీఐ విక్రమ సింహా, డిటిఆర్ బి సిఐ ఆదిలక్ష్మీల ఆధ్వర్యంలో కర్నూలు పట్టణంలో ప్రత్యేక విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. బ్లూ కోల్ట్స్ బృందాలు మరియు క్యూఆర్టీ పోలీసు బృందాలు పాల్గొని కట్టుదిట్టంగా విజిబుల్ పోలీసింగ్ చేపట్టాయి. డ్రంక్ ఒ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 112 /100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు:ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్

కర్నూలు, మే 04 (శ్రీచక్ర): ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి ఇంచార్జ్ కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఖఉఖీా సమస్యల పరిష్కారంలో మరింత శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిటిషనర్లకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ ను స్పష్టంగా ఇచ్చి, సంతృప్తి శాతం పెంచాలన్నారు. ఎండార్స్మెంట్ స్పష్టంగా ఉండాలని, ఒక వేళ సమస్య పరిష్కరించ లేకపోతే ఎందువల్ల సమస్యను పరిష్కరించలేకపోతున్నామో, పిటిషనర్లకు బాగా అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఫిర్యాదు అందిన మొదటి రోజే దానిని పరిశీలించి, పరిష్కారానికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.. రీఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ పూర్తిగా శాతాన్ని తగ్గించాలని ఇంచార్జి కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ,కొండయ్య, సునీత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఫెయిల్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

**సప్లిమెంటరీలో ఉత్తీర్ణతే లక్ష్యం**
**అధికారులకు దిశానిర్దేశం**
**విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలి**
**స్పెషల్ ఆఫీసర్లకు కలెక్టర్ సూచనలు**
**3,375 మంది ఫెయిల్ విద్యార్థులపై ప్రత్యేక కార్యాచరణ**
**రెమెడియల్ క్లాసులతో విద్యార్థులకు నూతన ఆశలు**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





నంద్యాల, మే 04 (శ్రీచక్ర): పదవ తరగతి పరీక్షల్లో విఫలమైన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్పెషల్ ఆఫీసర్లకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. జిల్లా పదో తరగతి ఫలితాలు రాష్ట్ర స్థాయిలో మెరుగ్గా ఉన్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 3,375 మంది విద్యార్థులు ఫెయిల్ కావడం ఆందోళనకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా సైన్స్, గణితం సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విఫలమవ్వగా, తెలుగులో కూడా విద్యార్థులు ఫెయిల్ కావడం గమనార్హమని చెప్పారు. ఒకటి, రెండు లేదా మూడు సబ్జెక్టుల్లో విఫలమైన విద్యార్థుల వివరాలను సవివరంగా విశ్లేషించి, వారికి తగిన విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రతి రోజు ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు రెమెడియల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20 మందికి పైగా విద్యార్థులు విఫలమైన పాఠశాలలోనే ఈ తరగతులు నిర్వహించాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఈ తరగతులను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, విద్యార్థుల్లో నమ్మకం కలిగించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల డేటా సేకరణకు సంబంధించి తల్లిదండ్రుల సరైన ఫోన్ నంబర్లను నమోదు చేసి డేటాను శుద్ధి చేయాలని ఆదేశించారు. ఫెయిల్ అయిన విద్యార్థులను సంప్రదించే ప్రయత్నాల్లో అనేక ఫోన్ నంబర్లు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను సరిదిద్ది తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, అధికారుల పనితీరులో బాధ్యతాయుత ధోరణి అవసరమన్నారు. తనిఖీలకు సంబంధించిన ఫోటోలను గ్రూపుల్లో కాకుండా నేరుగా తమకు పంపాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను కనీసం 10 శాతం పెంచే దిశగా కృషి చేయాలని, నాణ్యత లేని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న యూనిఫాంలు, విద్యా కానుక కిట్లు, పాఠ్యపుస్తకాలు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలని అన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది మరియు విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి మొదటి తరగతిలో అడ్మిషన్లను పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డీఈఓ జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుకాణాల వద్ద డస్ట్ బిన్‌లు తప్పనిసరి

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**
**స్వచ్ఛతకు సహకరించకపోతే జరిమానాలు, ట్రేడ్ లైసెన్స్ రద్దు**
**100 శాతం చెత్త సేకరణలో అలసత్వం తగదు**





కర్నూలు, మే 4 (శ్రీచక్ర): నగరంలో ఉన్న వాణిజ్య దుకాణాల వద్ద తప్పనిసరిగా నిర్వాహకులు డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, స్వచ్ఛతకు సహకరించకపోతే జరిమాన విధింపు, ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. సోమవారం ఉదయం 2వ శానిటేషన్ డివిజన్‌లో మస్టర్ తనిఖీ నిర్వహించారు. కుమ్మరి గేరి, గడియారం ఆసుపత్రి, పెద్ద మార్కెట్, జమ్మిచెట్టు, జౌహరపురం, గాంధీనగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పలు దుకాణాల వద్ద డస్ట్‌బిన్‌లు లేకపోవడం, ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉండటంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బంది పరిశుభ్రతపై మరింత పట్టు సాధించాలని, ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్‌ఏర్పాటుచేసి, 100శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాక్టర్ ట్రాలీలను వ్యాపారస్తులు సమర్థవంతంగా వినియోగించుకునేలా చూడాలని సూచించారు. అలాగే వినాయక ఘాట్ వద్ద కేసి కెనాల్‌ను కమిషనర్ పరిశీలించారు. గ్యాంగ్ వర్క్ పెట్టి, శుభ్రం చేయించాలని ఆదేశించారు. ×అన్న క్యాంటీన్ల నిర్వహకులపై అసంతృప్తికలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్, అక్కడ అల్పాహారం చేస్తున్న ప్రజలతో మాట్లాడి నాణ్యత ప్రమాణాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆహార నాణ్యత సరిగా లేదని ఫిర్యాదులు రావడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్, భోజనాశాల నిర్వహకులతో ఫోన్‌లో మాట్లాడి రుచికరంగా, ప్రమాణాలకు అనుగుణంగా వంటలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు ఆర్. రాజు, నాగేశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# 100 రోజుల ఉచిత ఆన్‌లైన్ యోగా తరగతులకు విస్తృత ప్రచారం

**ప్రతి ఒక్కరికీ యోగా క్లాసుల లింక్ షేర్ చేయాలని ఆదేశం**
**రోజుకు ఆరు సెషన్లతో యోగా కార్యక్రమం**
**పీజీఆర్ఎస్ వేదికల్లో ఆయుష్ మెడికల్ క్యాంపులు**
**నిర్వహణజిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**





నంద్యాల, మే 04 (శ్రీచక్ర): అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా పురస్కరించుకుని 100 రోజుల ఉచిత ఆన్‌లైన్ యోగా తరగతులకు విస్తృత ప్రచారం చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ మరియు మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా సంయుక్తంగా నిర్వహిస్తున్న 100 రోజుల ఉచిత ఆన్‌లైన్ యోగా తరగతుల గురించి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు మరియు సాధారణ ప్రజలకు ఈ తరగతుల లింక్‌ను విస్తృతంగా షేర్ చేసి, ఎక్కువ మంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే మొదటి 14 రోజుల లైవ్ యోగా సెషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6, 7, 8 గంటలకు మరియు సాయంత్రం 4 నుంచి 7 గంటల మధ్య మూడు సెషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో సెషన్ 45 నిమిషాల పాటు కొనసాగుతుందని, ఈ కార్యక్రమాన్ని 'హాబిల్డ్ హెల్త్ టెక్' సంస్థతో కలిసి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, మండల మరియు జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగం (ఖఉఖీా) కార్యక్రమాల్లో ఆయుష్ విభాగం ద్వారా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, సిద్ధ వంటి సంప్రదాయ వైద్య విధానాల ద్వారా ప్రజలకు చికిత్స అందించడంతో పాటు అవగాహన పెంచాలని సూచించారు. నంద్యాల పట్టణంలో ఈ వైద్య సేవలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కెమికల్ మందుల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను తగ్గించేందుకు సంప్రదాయ వైద్య విధానాలపై ప్రజల్లో నమ్మకం పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికంగా కనిపిస్తున్న మెడ, నడుము, మోకాళ్ల నొప్పుల నివారణలో ఆయుర్వేద తైలాలు ప్రయోజనకరమని వివరించారు. కర్పూర తైలం, మహానారాయణ తైలం, పిండ తైలం, సహచరాది తైలం వంటి ఔషధ తైలాల వినియోగంతో నొప్పుల నుండి ఉపశమనం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. వీటి వినియోగంతో పాటు యోగా సాధన చేయడం ద్వారా దీర్ఘకాలికంగా ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. ఈ తైలాలు ప్రభుత్వ సరఫరా ద్వారా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్ వేదికల్లో ఆయుష్ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఆయుష్ మెడికల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# ప్రభుత్వం ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశారు

**విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం**
**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**

కర్నూలు, మే, 04 (శ్రీచక్ర): కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ గారు మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ ఒ బి విభాగంలో ప్రభుత్వ అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, తన కుమారుడి వద్ద నుండి రూ. 2 లక్షల 50 వేలు తీసుకుని మోసం చేసిన కర్నూలు , స్టాంటన్ పురం కు చెందిన సురపురాజువిజయ్ కుమార్ అనే వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని కర్నూల్ రూరల్ మండలం, నిడ్జూర్ గ్రామం కు చెందిన షేక్షావలి ఫిర్యాదు చేశారు. నన్ను డబ్బుల కోసం హాని ట్రాప్ కు గురి చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, ఆటోనగర్ చెందిన విజయ్ కుమార్ ఫిర్యాదు చేశారు. తమకు చెందిన వ్యవసాయ భూమి ని ఇతరులు ఆక్రమించుకున్నారని, సంతకాలు ఫోర్జరీ చేసి చీటింగ్ చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, ఇంజనీర్స్ కాలనీకి చెందిన రాఘవేంద్ర ఫిర్యాదు చేశారు. 2026 ఏప్రిల్ 29న మా అమ్మ బ్రెయిన్ స్ట్రోక్ తో చనిపోయింది. మా నాన్న ఆచూకీ తెలియడం లేదు. మెడికల్ కళాశాలలో పనిచేస్తూ రిటైర్ అయ్యాడు. మా నాన్న బ్యాంకు ఖాతాలో రూ. 36 లక్షల రిటర్మెంట్ బెనిఫిట్స్ ఉన్నాయి. ముగ్గురిపై అనుమానం ఉందని, మా నాన్న ఆచూకీ తెలపాలని కర్నూలు , ఆరోరా నగర్ కు చెందిన పత్తి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. కర్నూలు ,వాణిజ్య నగర్ సొసైటీలో ఉన్న నా స్థలం ఆక్రమించుకొని కన్స్ట్రక్షన్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు , జమ్మి చెట్టు వీధికి చెందిన శేషు యాదవ్ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు శివ శంకర్, రామయ్య నాయుడు, రామానీజులు పాల్గొన్నారు.



## ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు...,

## చిట్టేడు ఎస్టి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వై.దామోదర్ నాయుడు వెల్లడి...,

కోట :మే4 (శ్రీ చక్ర) : 2026 -27 విద్యా సంవత్సరానికి గాను ఐటీడీఏ యా నాదుల నెల్లూరు పరిధిలోగల చిట్టేడు ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల నందు జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశం కొరకు నెల్లూరు,తిరుపతి,చిత్తూరు జిల్లాల్లో పదవ తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ వై.దామోదర్ నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా సోమవారం చిట్టేడు బాలుర ఎస్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వై.దామోదర్ నాయుడు మాట్లాడుతూ తిరుపతి,నెల్లూరు జిల్లాలోని విద్యార్థులు గురుకుల కళాశాలలో దరఖాస్తు చేసుకోవడానికి ఎస్ టి,ఎస్ సి,బి సి,ఓ సి విద్యార్థులు అర్హులని, అదేవిధంగా చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్టీ విద్యార్థులకు విడిగా ప్రతి గ్రూపులోను ఐదు శాతం సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. అయితే ఎస్టీ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని మిగిలిన సీట్లలో ఇతర ఎస్టీ విద్యార్థులను అధికారుల సూచనల మేరకు ప్రవేశాలు కల్పించబడుతుందని తెలియజేశారు.దరఖాస్తు చేరువారికి లక్ష రూపాయల లోపు వార్షిక ఆదాయం ఉండాలని,గ్రూపు వారీగా,కేటగిరి వారీగా సీట్లు కేటాయింపు క్రింది విధంగా ఉంటుందన్నారు.ఎంపీసీ 40, బైపిసి 40,హెచ్ ఈ సీ 40,ఏ అండ్ టి 20 సీట్లు ఉంటుందని,అయితే ఎస్సీ వారికి ఒకటి,బీసీ వారికి ఒకటి,ఓసి వారికి ఒకటి,ఎస్టీ వారికి 36,స్పోర్ట్స్ కేటగిరీ వారికి ఒకటి చొప్పున మొత్తం 40 సీట్లు అన్నీ గ్రూపులో ఉంటాయన్నారు.ఆసక్తి గల విద్యార్థులు ఆన్లైన్ ద్వారా https://twreiscet.apcfss.in/ తమ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోగా చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే 9440204745,8096030122,7660805802 ఈ నంబర్లను సంప్రదించవచ్చునన్నారు.

## బిజెపి విజయోత్సవ ర్యాలీ






జీలుగుమిల్లి, మే-04( శ్రీ చక్ర,)పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరీలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సోమవారం మండల కేంద్రం జీలుగుమిల్లి, దర్భ గూడెం గ్రామాలలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు చాత్రాతి ప్రసాద్, మండల బిజెపి అధ్యక్షులు గుడ్ల రాంబాబు మాట్లాడుతూ సోమవారం వెలువడిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో దేశం కోసం ధర్మం కోసం బిజెపికి ఓటు వేసి గెలిపించిన బెంగాల్ అస్సాం పుదుచ్చేరి ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బెంగాల్లో మమతా బెనర్జీ అరాచక పాలనకు ముగింపు పలకడం రాష్ట్ర ప్రజల ఔన్నత్యానికి నిదర్శనం అన్నారు. రానున్న రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో భాజపా అధికారులకు రావడం ఖాయమని తెలిపారు. ప్రజలు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అభివృద్ధిని ప్రజల నమ్మరని అన్నారు. భవిష్యత్తులో భారతదేశం అభివృద్ధిలో ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలువనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులగం, సుబ్బారెడ్డి, కేతిరెడ్డి నెహ్రూ రెడ్డి, వీరంకి బాలు, సోమిరెడ్డి, రేపాక గోపాలం, దారా మధు, జనసేన నాయకులు బండారు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం



మార్కాపురం మే 4 ( శ్రీ చక్ర)మార్కాపురం లోని సౌజన్య ఫంక్షన్ హాల్ నందు కృష్ణా జలాల పోరాట సమాలోచన, త్రాగు, సాగు నీటికై వెలుగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతి పై సమావేశం రాయల సీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి అని ఉమ్మడి ప్రకాశం జిల్లా సమావేశం..హాజరైన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్ మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల చైర్మన్ మాజీ మంత్రి సాకే శైలజనాథ్ మాజీ శాసనసభ్యులు అన్నా రాంబాబు ఎమ్మెల్యే చంద్రశేఖర్, నియోజకవర్గ ఇంచార్జ్ లు కెపి నాగార్జున రెడ్డి, దద్దాల నారాయణ, మేరుగ నాగార్జున, మాజీ మంత్రి ఆది మూలపు సురేష్, చుండూరి రవిబాబు

# గోవర్ధనపురం లో బీజేపీ జెండా ఆవిష్కరణ పాల్గొన్న, రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులు



వరదయ్యపాలెం,మే 4(శ్రీ చక్ర)గోవర్ధనపురంలో బీజేపీ జెండా ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమం కేవలం ఒక రాజకీయ కార్యక్రమం మాత్రమే కాదు?గ్రామీణ స్థాయిలో మార్పు, అభివృద్ధి, మరియు ప్రజల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలిచింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ జరగడం ద్వారా పార్టీ శక్తి, క్రమశిక్షణ, మరియు భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టమైన సంకేతం ఇచ్చింది.ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు విజయం పట్ల సంబరాలు జరుపుకోవడం, స్వీట్లు పంపిణీ చేయడం ద్వారా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. “మన ఊరు ? మన జెండా” కార్యక్రమం ద్వారా కేంద్రంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలని పార్టీ సంకల్పం స్పష్టంగా కనిపించింది. ఇది కేవలం నినాదం కాదు, గ్రామీణ అభివృద్ధిని వేగవంతం చేసే ఉద్యమంగా మారుతోంది. మండల అధ్యక్షుడు ఢిల్లీ ప్రకాష్ (దిలీప్ రాయల్) ఆధ్వర్యంలో కార్యక్రమం సజావుగా నిర్వహించబడింది. ముఖ్య అతిథులను డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు ఘనంగా సత్కరించారు. దీని ద్వారా స్థానిక నాయకత్వం యొక్క ఆతిథ్యభావం, సమన్వయం ప్రతిఫలించింది. మన ఊరు - మనజెండా కు రాష్ట్ర అధ్యక్షులను గజమాలతో సత్కరించిన ఓ బి సి మోర్చా కార్యదర్శి మురళి ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు మునిసుబ్రహ్మణ్యం, బీసీ నాయకుడు జల్లి మధుసూదన్ లు అభినందించారు. అలాగే స్థానిక టీడీపీ మండల అధ్యక్షుడు పి. యుగంధర్ రెడ్డి పాల్గొనడం రాజకీయ వైవిధ్యాన్ని, సమన్వయాన్ని ప్రతిబింబించింది.ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ చేసిన ప్రసంగం కార్యక్రమానికి హైలైట్‌గా నిలిచింది. ఆయన మాట్లాడుతూ, “గ్రామీణ భారతమే దేశ అభివృద్ధికి పునాది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామాలకు చేరినప్పుడే నిజమైన మార్పు కనిపిస్తుంది. ప్రతి కార్యకర్త ఒక సేవకుడిగా పనిచేసి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి” అని పిలుపునిచ్చారు. ఆయన మాటల్లో బాధ్యత, దృక్పథం, మరియు సేవా భావం స్పష్టంగా కనిపించింది.మొత్తానికి, ఈ కార్యక్రమం బీజేపీకి గ్రామీణ స్థాయిలో బలం చేకూర్చడమే కాకుండా, ప్రజల్లో అభివృద్ధి పట్ల నమ్మకాన్ని పెంచే దిశగా ముందడుగు వేసింది. రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికలకే పరిమితం కాకుండా, గ్రామీణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తేనే ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది అనే సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా తెలియజేసింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి మాజీ మోర్చా కార్యదర్శి టి సిద్దులయ్య,భాస్కర్ రెడ్డి, శుభరత్నమ్మ, మాజీ మండల అధ్యక్షులుపురుషోత్తం, మండల ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ , బి ప్రసాద్, బుగ్గల ఏసు, మండల ఉపాధ్యక్షులు బుగ్గల సుబ్రమణ్యం, బిగువు నాగేశ్వరావు, మాజీ ఎస్సీ మోర్చా కార్యదర్శి వై అన్వేష్, అంకయ్య, గోపి,విపురుషోత్తం, జిల్లా కౌన్సిల్ మెంబర్ మునిశేఖర్, ఓబీసీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ ఆనంద నాయుడు బుచ్చినాయుడు కండ్రిక మండల అధ్యక్షులు దాసరి గురుస్వామి, కేవీపీ పురం మండల అధ్యక్షులు బాబు,బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

## వెలుగొండ పై మాట్లాడే నైతిక హక్కు వైసిపికి లేదు..

## వైసిపి నాయకులకు సూచించిన డాక్టర్ ఏలూరి.



మార్కాపురం మే 4 ( శ్రీ చ) క్రమార్కాపురం..శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పై వైసీపీ నాయకులు చూపిస్తున్న కపట ప్రేమను చూసి పశ్చిమ ప్రాంత ప్రజలు నవ్వుకుంటున్నారని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సోమవారం న ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు..ఈ నేపథ్యంలో బిజెపి నేత డాక్టర్ ఏలూరి రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ పూర్తికాని ప్రాజెక్టును జాతికి అంకితం చేసి,ఈ ప్రాంత ప్రజలను నిలువునా మోసం చేసిన ఘనత వైసీపీ నాయకులకే దక్కుతుందని పేర్కొన్నారు..పూర్తయిన ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని వైసిపి నాయకులు అడగడం విడ్డూరంగా ఉందని, సంపూర్ణంగా పూర్తయిన ప్రాజెక్టుకు నిధులు ఎందుకు అని ప్రశ్నించారు.వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలం అధికారంలో ఉండి ప్రాజెక్టును పూర్తి చేయడంలోవిఫలమైనప్పటికీ,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుండి ఈ ప్రాంతంపై ముక్కువతో వెలుగొండ ప్రాజెక్టు పనులను శరవేగంగా చేస్తున్నామని తెలిపారు..ఈ ప్రాంత ప్రజలను మళ్ళీ దగా చేయడానికి వైసిపి నాయకులు వెలుగొండ ప్రాజెక్టు పనుల పురోగతి అంటూ సమావేశాలు నిర్వహించడం హేయమైన చర్య అని పేర్కొన్నారు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు..కూటమి ప్రభుత్వం పశ్చిమ ప్రాంత చిరకాలవాంఛ మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి ఇచ్చిన హామీని నెరవేర్చిందని గుర్తు చేశారు..ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అభివృద్ధి చేస్తామని తెలిపారు..ప్రజలు కూడా వైసిపి నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను గమనిస్తున్నారని ప్రజాక్షేత్రంలో వారికి మరొకసారి ఓటమి తప్పని జోస్యం చెప్పారు.

## మూడు రాష్ట్రాల్లో బిజెపి భారీ విజయం సాధించినందుకు పత్తికొండలో బిజెపి నాయకులు సంబరాలు.





పత్తికొండ మే 4 భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా సాధిస్తున్న అద్భుత విజయాల నేప థ్యంలో సోమవారం పత్తికొండలో బిజెపి పార్టీ శ్రేణుల బైక్ ర్యాలీ అనంతరం విజ యోత్సవ సంబరాలు ఘనంగా నిర్వ హించారు.మూడు రాష్ట్రాల్లో భారీ విజ యకేతనం ఎగురవేసిన భారతీయ జన తా పార్టీ విజయాన్ని పురస్కరించుకుని బీజేపీ శ్రేణులు ఉత్సాహభరితంగా సం బరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్ర మంలో పత్తికొండ బీజేపీ మండల అధ్య క్షుడు కరణం నరేష్ ఆధ్వర్యంలో జరిగిం ది.బైక్ ర్యాలీగా ప్రారంభమైన ఈ విజ యోత్సవం పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ఘనంగా కొనసాగింది.కార్య క ర్తలు భారీగా పాల్గొని జై బీజేపీ నినాదా లతో పట్టణ ప్రధాన రోడ్డులో నినాదాల తో మార్మోగాయి.అనంతరం భానుసం చా పేల్చి, ప్రజలకు మిఠాయిలు పంచు తూ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సంబరా లు జరుపుకున్నారు.ఈ సందర్భంగా అ సెంబ్లీ కో-కన్వీనర్ గోవర్ధన్ నాయుడు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన బాం గ్లాదేశ్ ప్రజలు తమ ఓటుతో మన దేశా న్ని కాపాడేది,మనల్ని కాపాడేది భాజ పాయే,నరేంద్ర మోడీయే అని గుర్తించి ఓట్లు వేశారని,ఆ రాష్ట్ర భాజపా నాయ కులు, కార్యకర్తలు ప్రాణాలొడ్డి కష్టపడి గెలుపు కోసం కృషి చేసి సరికొత్త రికార్డు సాధించి పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని అ త్యధిక సీట్లతో గెలిచి కైవసం చేసుకుని మొట్ట మొదటి సారిగా బిజెపి ప్రభుత్వా న్ని ఏర్పాటు చేసిందని.దేశ ప్రజలు అభి వృద్ధి, సుస్థిర పరిపాలనకు మద్దతుగా భారతీయ జనతా పార్టీకి మరోసారి అ ఖండ విజయాన్ని అందిం చారని తెలిపా రు.ప్రధాని నాయకత్వంపై ప్రజలకుఉన్న నమ్మకం రోజు రోజుకీ పెరుగుతోందని పే ర్కొన్నారు.ఈ విజయాలు భవిష్యత్తులో మరింత పెద్ద విజయాలకు బాటలు వే స్తాయని అన్నారు.పత్తికొండలో కూడా బీజేపీ శక్తిని మరింత బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సా ధిస్తామని ధీమా వ్యక్తం చేశారు బిజెపి నాయకులు రామాం జనేయులు రామాంజనేయులు,దండి మల్లికార్జున పూనా మల్లికార్జున, రాంప ల్లి రంగయ్య,లక్ష్మణరావు అడ్వకేట్ నా గేష్, సీసీ రంగన్న, నరసింహులు, బాబ్జి గౌడ్.మాలేకర్ విరేష్, సురేష్ నాయక్ భగవాన్ రావు, రవీంద్ర,రామ్ నాయు డు,తిమ్మరాజు, రామ్ చరణ్, ఈశ్వర ప్ప, తదితరులు పాల్గొన్నారు

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

### PGRS కార్యక్రమంలో వినతులు స్వీకరించిన జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందాల్, ఐపీఎస్

గుంటూరు, మే 4 :గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందాల్, ఐపీఎస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులు, వినతులను స్వీకరించి, ప్రతి అంశాన్ని శ్రద్ధగా పరిశీలించారు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యల వివరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు సమర్పించిన ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, వారి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు అత్యుత్తమ సంతృప్తి కలిగే విధంగా ఉత్తమమైన పోలీస్ సేవలు అందించడం పోలీస్ శాఖ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.వి. రమణమూర్తి, మహిళ పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్ పాల్గొని, వచ్చిన వినతులను నమోదు చేసి తదుపరి చర్యల కోసం సంబంధిత విభాగాలకు పంపించారు.

## నారా లోకేష్ ను కలిసిన బిర్రు ప్రతాప్ రెడ్డి




విజయవాడ, మే 4 (శ్రీచక్ర): అమరావతిలోని ముఖ్యమంత్రి నివాసంలో తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ని ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పెండింగ్ జీతభత్యాలను విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్పందించిన నారా లోకేష్,స్థానికసంస్థలప్రజా ప్రతినిధులపెండింగ్‌జీత భత్యాల విడుదలకు తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారని బిర్రు ప్రతాప్ రెడ్డి తెలిపారు

## నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్‌గా షేక్ ఖాసిం షరీఫ్ నియామకం



మార్కాపురం మే 4 ( శ్రీ చక్ర)మార్కాపురం, మే 4, 2026:× గిద్దలూరు నియోజకవర్గ మైనార్టీ డిపార్ట్‌మెంట్ సెల్ చైర్మన్‌గా కంభం పట్టణానికి చెందిన షేక్ ఖాసిం షరీఫ్ ని నియమించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి గారు మార్కాపురంలో నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా డా. మహబూబ్ వలి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, మైనార్టీల సంక్షేమానికి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఖాసిం షరీఫ్‌కి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

## సిఐ నీ మర్యాదపూర్వకంగా కలసిన బొంతల



మార్కాపురం మే 4 ( శ్రీ చక్ర)మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ ను విశాల్యాతో పుష్పగుచ్ఛ అందజేసినభారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొంతల కృష్ణ మరియు జాతీయ కౌన్సిల్ సభ్యులు శాసనాల సరోజిని కలసి శుభాకాంక్షలు తెలియజేశారు

## సిఐ నీ మర్యాదపూర్వకంగా కలసిన బొంతల

మార్కాపురం మే 4 ( శ్రీ చక్ర)మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ ను దృశ్యాలువపుష్పగుచ్ఛ అందజేసి నభారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొంతల కృష్ణ మరియు జాతీయ కౌన్సిల్ సభ్యులు శాసనాల సరోజిని కలసి శుభాకాంక్షలు తెలియజేశారు

# ఏపీలో స్వచ్ఛ రథాలు

విజయవాడ, మే 4 ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ ఇప్పుడు ఒక సామాజిక ఉద్యమంగా మారింది. "మన పారిశుధ్యం.. మన ఆరోగ్యం.. మన బాధ్యత" అని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు క్షేత్రస్థాయిలో ఫలితాలను ఇస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో పురుడుపోసుకున్న 'స్వచ్ఛ రథాలు' పల్లెల్లో చెత్తను సంపదగా మారుస్తూ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి.గత ఏప్రిల్ నెలలో ఈ స్వచ్ఛ రథాలు సాధించిన ప్రగతి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పల్లెల నుంచి రికార్డు స్థాయిలో సుమారు 19 లక్షల కేజీల పొడి చెత్తను ఈ రథాలు సేకరించాయి. కేవలం సేకరించడమే కాకుండా, 'చెత్త నుంచి సంపద' సృష్టి అనే యజ్ఞంలో భాగంగా ఆ వ్యర్థాలకు బదులుగా రూ. 3.32 కోట్ల విలువైన నిత్యవసర వస్తువులను ప్రజలకు పంపిణీ చేశారు. అంటే?. ఒకప్పుడు పనికిరాదని పారేసిన వస్తువులే నేడు గ్రామీణ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయిప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు టాలీవుడ్ ప్రముఖ నటుడు నాని తన వంతు సహకారాన్ని అందించారు. పారిశుధ్యంపై అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాల్లో ఆయన భాగస్వాములయ్యారు.తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయమని చెప్పడమే కాకుండా, అలా చేసిన వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం గొప్ప ఆలోచన అని నాని అభిప్రాయపడ్డారు. "పర్యావరణం కోసం పవన్ కల్యాణ్ చేస్తున్న ఈ కృషికి అభినందనలు. మీకు మద్దతుగా నిలిచే కోట్లాది మందిలో నేను కూడా ఒకడిని" అంటూ నాని తన అభిమానాన్ని చాటుకున్నారు."గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం స్వచ్ఛరథాలను తీసుకువచ్చింది. వీటి గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు అడిగిన వెంటనే తన వంతు సహాయ సహకారాలు అందించిన నానికి పవన్ కళ్యాణ్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం" అంటూ ఉపముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటన కూడా విడుదల చేసిందిభవిష్యత్తు తరాలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ పథకంలో ఒక వినూత్న కోణాన్ని చేర్చారు. ప్రతి గురువారం ఈ స్వచ్ఛ రథాలు నేరుగా పాఠశాలల వద్దకు వెళ్తాయి. విద్యార్థులు తమ ఇళ్ల నుంచి సేకరించిన పొడి చెత్తను అక్కడ అందజేస్తే, దానికి బదులుగా వారికి అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, పుస్తకాలు వంటి స్టేషనరీ సామాగ్రిని అందిస్తున్నారు. ఈ విధానం వల్ల పిల్లల్లో వ్యర్థాల నిర్వహణపై చిన్నతనం నుంచే బాధ్యత పెరుగుతోంది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'స్వచ్ఛ భారత్' స్ఫూర్తితో, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన 'స్వచ్ఛ ఆంధ్రా' లక్ష్యాలను చేరుకోవడమే ఈ స్వచ్ఛ రథాల ప్రధాన ఉద్దేశం. కేవలం రోడ్లను శుభ్రం చేయడమే కాకుండా, ఆ చెత్తను రీసైక్లింగ్ చేసి ఆర్థిక ప్రయోజనాలు కల్పించడం ద్వారా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్తున్నారు. ఈ విప్లవాత్మక మార్పు పల్లె ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా? ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి బాటలు వేస్తోంది.

# విశాఖకు భారీగా గ్యాస్....

విశాఖపట్టణం, మే 4, కొన్ని వారాలుగా ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న గ్యాస్ కొరత సమస్యకు తెరపడనుంది. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల కారణంగా నిలిచిపోయిన గ్యాస్ సరఫరా మళ్ళీ పుంజుకుంది. వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధినిదాటుకుని సుమారు 46 వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీ ని లోడ్ చేసుకున్న భారీ భారతీయ నౌక విశాఖపట్నం వైపు దూసుకువస్తోంది. ఈ భారీ ఎల్‌పీజీ నౌక మే 13వ తేదీన విశాఖపట్నం నౌకాశ్రయానికి చేరుకోనుంది.ఇందులో ఉన్న 46 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్ సుమారు 32 లక్షల గృహ సిలిండర్లను నింపడానికి సరిపోతుందని అంచనా. ఈ నౌక రాకతో రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్ర మరియు కోస్తా జిల్లాల్లో ఉన్న గ్యాస్ సిలిండర్ల వెయిటింగ్ పీరియడ్ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. నౌక విశాఖ చేరుకున్న వెంటనే, గ్యాస్‌ను పైప్‌లైన్ల ద్వారా విశాఖలోని ప్రతిష్టాత్మక 'భూగర్భ గ్యాస్ నిల్వ కేంద్రానికి' తరలిస్తారు. సముద్ర మట్టానికి సుమారు 190 మీటర్ల లోతులో ఉన్న ఈ కేంద్రం నుండి గ్యాస్‌ను హిందుస్తాన్ పెట్రోలియం , ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వంటి బాట్లింగ్ ప్లాంట్లకు పంపిస్తారు.అక్కడ సిలిండర్లలో నింపి వినియోగదారులకు పంపిణీ చేస్తారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా గ్యాస్ ధరలు పెరగడంతో ఏపీలో కూడా సిలిండర్ల లభ్యత కష్టమైంది. ఇప్పుడు సరఫరా మెరుగుపడటంతో మార్కెట్‌లో గ్యాస్ కొరత తీరడమే కాకుండా, సాధారణ ప్రజలకు ఊరట లభించనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ పంపిణీ వ్యవస్థను పర్యవేక్షిస్తూ, అక్రమ నిల్వలు ఉండకుండా చర్యలు చేపట్టింది. విశాఖ బాట్లింగ్ ప్లాంట్ నుండి ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 5 జిల్లాలకు మరియు ఇతర ప్రాంతాలకు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తారు. విశాఖపట్నంలో ప్రపంచంలోనే అత్యంత లోతైన మరియు భారతదేశంలోనే మొదటిదైన భూగర్భ ఎల్‌పీజీ స్టోరేజ్ క్యావెర్న్ ఉన్న సంగతి తెలిసిందే.

# పేపర్ మిల్లు మూత శాశ్వతమేనా

రాజమండ్రి, మే 4, తూర్పుగోదావరి జిల్లా పారిశ్రామిక చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కడియం ఆంధ్ర పేపర్ మిల్లుకు ఇప్పుడు గడ్డుకాలం దాపురించింది. కొన్ని దశాబ్దాలుగా వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ, జిల్లా ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించిన ఈ మిల్లును యాజమాన్యం అకస్మాత్తుగా 'లాకౌట్' చేస్తున్నట్లు ప్రకటించింది. శాశ్వత ఉద్యోగులెవరూ మిల్లుకు రావద్దంటూ యాజమాన్యం ఫోన్లకు సందేశాలు పంపడంతో కార్మికులు షాక్‌కు గురయ్యారు. గత కొంతకాలంగా తమ సమస్యలను పరిష్కరించాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ మిల్లు కార్మికులు శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నారుఈ క్రమంలో కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సింది పోయి, యాజమాన్యం ఏకపక్షంగా లాకౌట్ ప్రకటించడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. మిల్లు గేట్లకు నోటీసులు అంటించడంతో పాటు, మిల్లులోకి ఎవరినీ అనుమతించకపోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ అకస్మాత్తు నిర్ణయం వల్ల కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. ఆంధ్ర పేపర్ మిల్లు కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు, కడియం మరియు చుట్టుపక్కల ప్రాంతాలకు ఒక ఆర్థిక భరోసా.ఇక్కడ పని చేస్తున్న ప్రత్యక్ష మరియు పరోక్ష కార్మికులపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇప్పుడు మిల్లు మూతపడటంతో వారి భవిష్యత్తు అంధకారంలో పడింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి యాజమాన్యంతో చర్చలు జరపాలని, మిల్లును పునఃప్రారంభించి కార్మికుల ఉపాధిని కాపాడాలని జిల్లా వాసులు కోరుతున్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఈ పరిశ్రమ ఇలా లాకౌట్ అవ్వడం జిల్లా పారిశ్రామిక రంగానికి పెద్ద ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు.

# వైసీపీ గ్రాఫ్ పెరిగిందా...



విజయవాడ, మే 4, (న్యూస్ పల్స్) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. అందులో మూడు ప్రధాన పార్టీలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అతి పెద్ద పార్టీగా క్షేత్ర స్థాయి వరకు విస్తరించి ఉన్న పార్టీ. ఆ పార్టీ చరిత్ర నాలుగు దశాబ్దాలు. ఇకపోతే జనసేన పార్టీకి సినీ గ్లామర్ ఇమేజ్ ఉన్న పవన్ కళ్యాణ్ అధినేత. ఒక బలమైన సామాజిక వర్గం మద్దతు కూడా ఉన్నది. ఇక కేంద్రంలో నరేంద్ర మోడీ వంటి ఆకర్షణీయమైన నాయకత్వం బిజెపికి శ్రీరామరక్షగా ఉంది. అలాగే కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉండడం కూడా మరో సానుకూల పరిణామం. ఇక ప్రతిపక్షం వైపు చూస్తే వైసిపి ఉంది. ఆ పార్టీ మూడు సార్లు ఎన్నికల్లో పోటీ చేస్తే ఒకసారి మాత్రమే గెలిచింది. వైసీపీకి సర్వసత్తాక నాయకుడు వైఎస్ జగన్. 2019కి ముందు జగన్ కి ఉన్న ఇమేజ్ ఆకాశాన్ని అంటింది. దానికి కారణం తీసుకుంటే వైయస్సార్ వంటి ప్రజాకర్షణ కలిగిన నాయకుని కుమారుడిగా జగన్ ఆకర్షించారు. అదే విధంగా జగన్ కూడా దూకుడుతో కూడిన రాజకీయం అప్పట్లో చేస్తూ వచ్చారు. ఇవన్నీ కలసి వైసీపీ అధికారంలోకి వస్తే ఖచ్చితంగా మంచి జరుగుతుందని భావించి అన్ని వర్గాలు 2019 ఎన్నికల్లో ఆ పార్టీకి పట్టం కట్టాయి. అయితే 2024లో వైసీపీ ఓటమి చెందాక గత రెండేళ్ళలో వైసీపీలో పెద్దగా ఉత్సాహం అయితే ప్రోత్సాహం కనిపించట్లేదు అని అంటున్నారు. ఆ పార్టీ అధినాయకుడు కూడా తరచూ జనాల్లోకి రావట్లేదు, ఈ నేపథ్యంలో చూస్తుండగానే కాలం గడిచిపోతోంది.ఇక అధికార కూటమి కీలక ఘట్టంలోకి ప్రవేశించింది. అంటే ప్రభుత్వం పట్ల ప్రజలకి అమ్మ నెమ్మదిగా అసంతృప్తి బాహాటం అయ్యేందుకు అవకాశం ఉన్న వాతావరణ అన్న మాట. వివిధ వర్గాలలో అది బయటపడే సమయానికి అందుబాటులో ఉన్న ప్రతిపక్షం దాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా బలోపేతం అవుతుంది. ఇది ఎక్కడైనా జరిగే సహజ రాజకీయ ప్రక్రియ. ఆంధ్రప్రదేశ్ లో చూస్తే అటువంటి పరిస్థితి ఉందా అన్నది ప్రశ్న ఎదురవుతోంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ ప్రధాన ప్రత్యక్షంగా ఉంది, 40 శాతం ఓటు బ్యాంకు కూడా పార్టీకి ఉంది. కేవలం 11 సీట్లు అని ఆ పార్టీని కొట్టి పారేయడానికి లేదు. పైగా మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఒక ఇమేజ్ ఉన్న అధినేతగా జగన్ వైసీపీకి నాయకత్వం వహిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే ఒక బలమైన సామాజిక వర్గం అండ కూడా ఆ పార్టీకి ఆంగ బలం అర్థ బలం కూడా ఉన్నాయి .ఇక ఇన్ని రకాలుగా అనుకూలతలు ఉన్నా కూడా వైసీపీ జనంలోకి ఊహించినంతగా వెళ్ళలేకపోతోంది. పార్టీ నాయకులు కూడా మీడియాకే పరిమితం అవుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు వందలూ వేలుగా కనిపించిన నాయకులు ఇప్పుడు ఐదు పదిగా మాతమే కనిపిస్తున్నారు. అది కూడా మీడియాలోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇక అధినేత కూడా జనంలోకి వెళ్ళడం పాదయాత్రతోనే అన్నట్టుగా ఆలోచిస్తున్నారని ప్రచారంగా ఉంది. ఇవన్నీ పక్కన పెడితే రెండేళ్ల కూటమి పాలన పూర్తి చేసుకున్న సమయంలో సహజంగా ఏర్పడే ప్రజా వ్యతిరేకత అలాగే ఎంతో కొంత అసంతృప్తి ప్రతిపక్షానికి కలసి రావాలి. అదే విధంగా వైసీపీ గ్రాఫ్ ఈసరికే ఎంతో కొంత పెరిగి ఉండాలి. అంటే ఆ పార్టీకి 2024 లో వచ్చిన 40 శాతం ఓటు బ్యాంకుకి కనీసం రెండు మూడు శాతం అదనంగా పెరిగి ఉండాల్సింది. కానీ పరిస్థితి చూస్తే ఆ విధంగా కనిపించట్లేదు అని ఫ్యాన్ పార్టీలోనే చర్చ సాగుతోంది. కూటమి పట్ల వ్యతిరేకత ఉందని వైసీపీ నేతలు అంటున్నా అది తమ పార్టీ వైపుగా సానుకూలంగా మారకపోవడమేంటి అని వైసీపీలో తర్జనభర్జన పడుతున్నారని టాక్. వైసీపీ ఈ విషయంలో ఏం చేసింది ఏం చేయాలి అన్నదానిమీద కూడా పార్టీ సీనియర్లు కొంతమంది మదనపడుతున్నారని అంటున్నారు. అధినేత చూస్తే ఇప్పట్లో జనంలోకి వచ్చే అవకాశం అన్నది లేదు. దాంతో కూటమి పట్ల ఏమాత్రం అయినా ఏర్పడిన వ్యతిరేకత సానుకూలంగా మార్చుకోవాలని వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా సక్సెస్ కావట్లేదు అని అంటున్నారు. రెండేళ్ల పరిపాలన తర్వాత కూడా కూటమి ఇంకా అదే దూకుడు ప్రదర్శిస్తూ ముందుకు సాగుతోంది. ఎన్నికల ముందు వైసీపీని ఏ విధంగా చీల్చి చెండాడుతూ విమర్శలు చేసిందో అదే విధంగా ఇప్పుడు కూడా చేస్తోని. దానికి ధీటైన కౌంటర్లు వైసీపీ నుంచి రావడం లేదని అంటున్నారు. అవి జనంలోకి : దాంతో గొడ్డలి పార్టీ అని జగన్ మానసిక వ్యాధితో బాధపడుతున్నారని కూటమి పెద్దలు చేస్తున్న విమర్శలు జనంలోకి మెల్లగా వెళుతున్నాయా అన్న ఆందోళన కూడా వైసీపీ వర్గాల్లో ఉంది. కూటమి ప్రభుత్వం మీద పోరాటం చేసే విధంగా వైసీపీ తగినంత సరంజామాతో ముందుకు రాలేకపోతోంది. ఇవన్నీ చూస్తూ ఉంటే పుణ్య కాలం గడుస్తోందా అన్నది ఒక ప్రశ్న. అధినాయకత్వం విషయం చూస్తే పాదయాత్రతోనే అన్ని మారిపోతాయన్నట్లుగానే ఉంది. దీంతో వైసీపీ గ్రాఫ్ పెరగకపోతే కనుక రానున్న కాలంలో ఇబ్బందులు వస్తాయని కూడా సీనియర్ల అంతర్మధనం చెందుతున్నట్లుగా తెలుస్తోంది.

# తెలుగు వారికి టిపిక్స్ క్లబ్

విజయవాడ, మే 4,విదేశాంధ్రుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎపిఎనఆర్‌టిఎస్ సంస్థకు మరోసారి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవి వేమూరు విదేశాంధ్రుల కోసం మరింతగా సేవలందించే విధంగా కొన్ని కార్యక్రమాలను చేపట్టారు. అందులో ౧తిజూవలీ.ఇ-శ్రీబీఎ కూడా ఒకటి. ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశాల్లో ఉన్నప్పుడు ఎన్నారైలను ఉద్దేశించి ప్రతి ఒక్కరూ ఎంట్రప్రెనూరర్‌లుగా తయారై ఇతరులకు ఉపాధిని కల్పించేలా తయారు కావాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దానిని దృష్టిలో పెట్టుకునే రవి వేమూరు ఈ టింపెక్స్ క్లబ్‌ను రూపొందించారు. ఈ టింపెక్స్‌తో ఉద్యోగులతోపాటు, ఇంట్లో ఉన్న గృహిణులు కూడా ట్రేడింగ్ నిర్వహించవచ్చని చెప్పారు. ఈ టింపెక్స్‌కు సంబంధించి ఆయన చెప్పిన వివరాలను ఇక్కడ ఇస్తున్నాము.మన దేశంలో గానీ, విదేశాల్లో గానీ వ్యాపారం చేయడంలో ముందుండేవాళ్ళు గుజరాతీలు, తమిళులు. అంతర్జాతీయ వాణిజ్యంలో బలమైన నెట్‌వర్క్‌లను వారు కలిగి ఉన్నారు. విభిన్న పద్ధతుల్లో మంచి ఆదాయ మార్గాలను అన్వేషించుకొని, వ్యాపారవేత్తలు గా వారు రాణిస్తున్నారు. ఇదే విధంగా రాష్ట్రంలోని తెలుగువాళ్ళతోపాటు, విదేశాల్లో ఉన్న తెలుగువాళ్ళకు కూడా ట్రేడింగ్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తే వారు మరింతగా రాణించి గ్లోబల్ ఎంట్రప్రెన్యూరర్ గా తయారవుతారన్న ఉద్దేశ్యంతో ఏపీఎన్ఆర్టీఎస్ ఈ టింపెక్స్ క్లబ్‌ను రూపొందించింది.ప్రస్తుతం ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్, లిబరైలైజేషన్ (ఎల్‌పిజి) అయిన తర్వాత ఎవరైనా, ఎక్కడైనా వ్యాపారాలు చేసుకోవచ్చు. దానికి అనేక మార్గాలున్నాయి. మన రాష్ట్రంలో, మన దేశంలో ఇంకా చెప్పాలంటే మన ఇంట్లోనే వుంటూ మనం తయారు చేసే వస్తువులను ఇతర దేశాలకు ఎగుమతులు చేయవచ్చు. చిన్న చిన్న వస్తువులే కాదు.. పెద్ద పెద్ద వస్తువులను కూడా ఎగుమతి చేసి, డబ్బు సంపాదించవచ్చు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో రొయ్యలు, గుంటూరు మిర్చి పండించే రైతులు ఈ విధంగా చేస్తున్నారు. ఇతర దేశాలకు తమ ఉత్పత్తులను పంపుతున్నారు. లాభాలను ఆర్జిస్తు న్నారు. అయితే.. కేవలం కొన్ని వస్తువులే కాకుండా.. మరిన్ని వస్తువులను కూడా ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మంచి అవకాశం దొరికింది. ఈ అవకాశాన్ని ఏపీఎన్ఆర్టీఎస్(ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ) కల్పిస్తోంది. ౧ఎఖఇఛీ.ఇ-శ్రీబీఎ ద్వారా మన రాష్ట్రంలోనే వుంటూ గుజరాతీల లాగా, తమిళుల లాగా మనం కూడా బలమైన అంతర్జాతీయ వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశం పుష్కలంగా వుంది. ఆసక్తి వున్న వారికి, వ్యాపారవేత్తలుగా ఎదగాలని బలమైన వాంఛ వున్న వారికి అంతర్జాతీయ వాణిజ్యంపై శిక్షణ, అవకాశాలను ఎలా పొందాలి.. గైడెడ్ ట్రేడింగ్ గురించి సంపూర్ణమైన శిక్షణ ఇచ్చేందుకు ఈ సంస్థ రెడీగా వుంది.ఏపీలో వుండే వారికి ఎంతటి ప్రాధాన్యత వుందో విదేశాంధ్రులకు కూడా అంతే ప్రాధాన్యతను ఇస్తూ.. వారి సంక్షేమం, అభివృద్ధి, వ్యాపార సాధికారత పట్ల కూడా కట్టుబడి వుంది. కేవలం పెద్ద పెద్ద వ్యాపారవేత్తలే కాకుండా సరైన అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ సహాయ సహకారాలతో చిన్న చిన్న వ్యాపారులు, రైతులు, యువకులు, మహిళలు కూడా అంతర్జాతీయ విపణిలో నిలదొక్కుకునే అవకాశాలను కల్పిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వున్న తెలుగు వారిని నంబర్ వన్ గ్లోబల్ కమ్యూనిటీ లీడర్లుగా తీర్చి దిద్దాలని ఏపీ ప్రభుత్వం కూడా సంకల్పించింది. ఉద్యోగిత నుంచి వ్యాపారం వైపు ప్రజలను మార్చాలని నిర్ణయించు కుంది. అయితే తయారీ రంగాలు, పెద్ద వ్యాపారాలతో పోలిస్తే 'ట్రేడింగ'కి భారీ పెట్టుబడి లేదా ప్రత్యేక మౌలిక వసతులు అవసరమే లేదు. పార్ట్ టైమ్‌గా కూడా నిర్వహించ వచ్చు అని సంస్థ వారు చెబుతున్నారు. అయితే.. ఇందులో ఒప్పందాలు చేసుకునే విధానాలు, అందులో ప్రామాణికత, స్థిరమైన విధానాల ద్వారా సరైన దిశలో సాగేలా మనకు అవకాశాలు, అవగాహన కల్పిస్తారు. ట్రేడింగ్ ప్రారంభంలో వున్న వారు ఇబ్బందులు పడకుండా, వుండేందుకే సహాయ పడుతుంది. గృహిణులు, వారి కుటుంబీకులు కూడా కలిసి సంయుక్తంగా ఏదైనా వ్యాపారాన్ని చేసుకోవచ్చు. తెలుగు ట్రేడర్లు అంతర్జాతీయంగా ఇప్పటికే పాతుకుపోయిన ట్రేడ్ నెట్‌వర్క్‌లతో పోటీ పడాలంటే ఖర్చు కావాలి, అనుభవం కావాలి. ఈ రెంటితో పాటు మరిన్ని మెళకువలను కూడా ౧ఎఖఇఛీ.ఇ-శ్రీబీఎ అందిస్తుంది. అయితే తక్షణంగా వచ్చే లాభాల కంటే పెట్టుబడుల పైనే ఇది ఎక్కువ దృష్టి సారిస్తుంది. పెట్టుబడి భద్రతకు కూడా ప్రాధాన్యతను ఇస్తుంది. తయారీ రంగం లేదా పెద్ద వ్యాపారాలతో పోలిస్తే, ట్రేడింగుకు భారీ పెట్టుబడి లేదా ప్రత్యేక మౌలిక వసతులు అవసరం లేదు. పార్ట్ టైమ్ ద్వారా కూడా నిర్వహించొచ్చు. ఉత్పత్తుల అభివృద్ధి కంటే వేగంగా లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ప్రామాణిక ఒప్పందాలు, స్థిరమైన విధానాల ద్వారా ప్రమాదాలను కూడా తగ్గించొచ్చు. ప్రారంభ దశలో అత్యంత నిపుణత అవసరం లేకపోవడం వల్ల కొత్తగా వ్యాపారంలోకి వచ్చే వారికి ఇది అనుకూల మార్గమని అంటోంది. స్థిర ఆదాయం, అంతర్జాతీయ అనుభవం, విదేశీ మార్కెట్లకు ప్రత్యక్ష పరిచయం ఉన్న ప్రవాసాంధ్రులకు ఇది సహజమైన తదుపరి అడుగు. ఏపీఎన్ఆర్టీఎస్ కార్యక్రమాల ద్వారా తెలియజేసినట్లుగా, నెలలో కొన్ని రోజుల సమయంతో కూడా ఈ వ్యాపారాన్ని నిర్వహించొచ్చు. గృహిణులు, కుటుంబ సభ్యులు కలిసి ఒక సంయుక్త వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించడానికి కూడా ఇది అనువైన అవకాశం అని తెలియజేస్తోంది.

# పల్నాడు జిల్లాలో దోపిడీ గ్యాంగ్ అరెస్ట్

## 566 గ్రాముల బంగారం రికవరీ

పల్నాడు జిల్లా కారంపూడి మండలంలో సంచలనం రేపిన దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. దోపిడీలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ను అరెస్టు చేసి, భారీ మొత్తంలో బంగారం స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా గురజాల డిఎస్పి కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో జిల్లా ఎస్పీ కృష్ణారావు వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ, సులభంగా డబ్బు సంపాదించాలని భావించిన ఈ గ్యాంగ్ బంగారు ఆభరణాలు తీసుకువెళ్లే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా బంగారు షాపులకు ఆర్డర్లపై ఆభరణాలు సరఫరా చేసే వారిని టార్గెట్ చేసి 566 గ్రాముల బంగారం దోచుకున్నారని చెప్పారు.ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వీరిని పేట సన్నిగళ్ల గ్రామం సమీపంలోని ఎన్ఎస్పి కాలవ కట్ట వద్ద ప్రత్యేక బృందాలు పట్టుకున్నాయని చెప్పారు. అదేవిధంగా, నిందితుల నుంచి రెండు బైకులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.దోచుకున్న బంగారం మొత్తాన్ని పోలీసులు రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో పాల్గొన్న నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పోలీసుల అప్రమత్తతతో దోపిడీ గ్యాంగ్ అరెస్ట్ కావడంతో స్థానికుల్లో ఉపశమనం వ్యక్తమవుతోంది.

# కూటమి ప్రభుత్వం పై అసత్యపు ఆరోపణలు మానుకోండి

## వైఎస్సార్సీపీ ఇంచార్జ్ రాజీవ్ రెడ్డి తీరుపై టిడిపి నేతల ధ్వజం

నందవరం, వైసిపి ప్రభుత్వ హయాంలో అధికార మదంతో ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించి అక్రమంగా నిర్మించిన పార్టీ కార్యాలయాలపై అధికారులు చర్యలు తీసుకుంటే కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కాసిం వలి,సొసైటీ చైర్మన్ ధర్మపురం గోపాల్ నాయకులు మండిపడ్డారు.శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ పార్టీ నాయకులు నాగలదిన్నె గ్రామంలో ఏమి చేశారో వాస్తవాలు తెలుసుకొని నియోజకవర్గ ఇంచార్జ్ రాజీవ్ రెడ్డి మాట్లాడితే మంచిదని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి వైఎస్సార్సీపీ కార్యాలయాలను నిర్మించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.ఆక్రమణల విషయంలో గతంలోనే అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినా ఆ పార్టీ నాయకులు పట్టి పటనట్లు వ్యవరించారాని తమ నాయకుల మీదా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందంటూ రాజీవ్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను వారు ఖండించారు.

# కల్తీ నెయ్యి వ్యవహారంలోధర్మారెడ్డికి బిగిస్తున్న ఉచ్చు

తిరుపతి, మే 4, (న్యూస్ పల్స్)ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవం, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన కల్తీ నెయ్యి వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ భారీ కుంభకోణానికి టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి ప్రధాన కారకుడని ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ తేల్చి చెప్పింది. తాజాగా మీడియాకు అందుతున్న సమాచారం ప్రకారం, శ్రీవారి నెయ్యి టెండరు నిబంధనలను నిబంధనలకు విరుద్ధంగా సడలించడంలో ధర్మారెడ్డి కీలక పాత్ర పోషించారని కమిషన్ నిర్ధారించింది.


సాధారణంగా టీటీడీకి సరఫరా చేసే నెయ్యి విషయంలో అత్యంత కఠినమైన నిబంధనలు ఉంటాయి. అయితే, ధర్మారెడ్డి హయాంలో ఈ నిబంధనలను సడలించడం ద్వారా నాణ్యత లేని, కల్తీ నెయ్యిని సరఫరా చేసే సంస్థలకు టీటీడీలోకి మార్గం సులభమైందని నివేదిక పేర్కొంది. అప్పట్లోనే నాణ్యతపై ఫిర్యాదులు వచ్చినా, సదరు సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి చర్యలు తీసుకోకుండా.. వాటినే కొనసాగించేలా నిర్ణయాలు తీసుకోవడం వెనుక ధర్మారెడ్డి ప్రమేయం ఉందని కమిషన్ వెల్లడించింది. దీనివల్ల భక్తుల సెంటిమెంట్‌తో ఆడుకోవడమే కాకుండా, ప్రసాదం నాణ్యతను దారుణంగా దిగజార్చారని కమిషన్ ఆక్షేపించింది. ఈ కల్తీ నెయ్యి కుంభకోణంలో ధర్మారెడ్డిపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి నివేదించింది. అంతేకాకుండా, ఈ వ్యవహారంలో అప్పటి ఈవో సింఘాల్ మరియు ఆర్థిక సలహాదారు బాలాజీల ప్రమేయంపై కూడా ప్రస్తావించడం గమనార్హం. నిబంధనల సడలింపు, ఆర్థిక లావాదేవీలు మరియు టెండర్ల ఖరారులో వీరి పాత్రపై కూడా విచారణ జరగాల్సిన అవసరం ఉందని నివేదికలో పేర్కొన్నారు. భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసిన అధికారులపై ఇప్పుడు ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటుందో అన్నది వేచి చూడాలి.

# "దోసకాయ పచ్చడి" ఇలా చేస్తే ఆరోగ్యానికి ఎంత మేలో !!



ఆంధ్ర ఇంటి వంటల్లో రోటి పచ్చడికి ప్రత్యేక గుర్తింపు ఉంది. మిక్సీలో కాకుండా రోట్లో నూరితే వచ్చే రుచి, వాసన ఈ పచ్చడికి అసలు జాతిని ఇస్తాయి. ముఖ్యంగా దోసకాయతో చేసే ఈ పచ్చడి తేలికగా జీర్ణమవుతుంది. వేసవి కాలంలో శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఈ పచ్చడిని రోట్లో నూరి, కొత్త నెయ్యితో కలిపి వడ్డించడం ఆనవాయితీగా ఉంటుంది. ఇది కేవలం అన్నంతోనే కాదు, జొన్న రొట్టె, రాగి సంగటి, ఇడ్లీ, దోసె వంటి వాటితో కూడా అద్భుతంగా సరిపోతుంది. కాగా సింపుల్ పదార్థాలతో, తక్కువ సమయంలో తయారయ్యే ఈ పచ్చడి ఆంధ్ర వంటకాలలో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. దోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో, ఈ పచ్చడి తినడం వల్ల శరీరానికి హైడ్రేషన్ లభిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా ఇది సహాయపడుతుంది. వెల్లుల్లి, చింతపండు, మసాలాలు కలిసినప్పుడు రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా అందిస్తాయి. ప్రత్యేకంగా వేసవిలో ఆకలి తగ్గినప్పుడు ఈ పచ్చడి అన్నంలో కలిపి తింటే మంచి రుచి, తేలికైన ఫీలింగ్ ఇస్తుంది. నేటి ఫాస్ట్ ఫుడ్ కాలంలో కూడా ఇలాంటి సంప్రదాయ వంటకాలు ఆరోగ్యానికి ఎంత ఉపయోగకరమో గుర్తుచేస్తాయి. ఈ టేస్టీ రెసిపీ మీకోసం ప్రత్యేకంగా.. కావలసిన పదార్థాలు.. దోసకాయ: 1 పెద్దది (సుమారు 275-300 గ్రాములు) నూనె: 4 టేబుల్ స్పూన్లు పల్లీలు (వేరుశనగ గుళ్లు): 2 టేబుల్ స్పూన్లు ఎండుమిర్చి: 12-15 లేదా రుచికి తగినంత ధనియాలు: 1 టేబుల్ స్పూన్ జీలకర్ర: అర టీస్పూన్ చింతపండు: చిన్న నిమ్మకాయ సైజు (నానబెట్టినది) వెల్లుల్లి రెబ్బలు: 4-5 పసుపు: పావు టీస్పూన్ ఉప్పు: రుచికి తగినంత తాలింపు కోసం: ఆవాలు, ఎండుమిర్చి, శనగపప్పు, మినపప్పు, ఇంగువ మరియు కరివేపాకు తయారీ విధానం.. ముందుగా దోసకాయను శుభ్రంగా కడిగి, పీలర్‌తో చెక్కు తీసుకోవాలి. దానిని నిలువుగా కోసి లోపల ఉన్న గింజలను తీసేసి (అవసరమైతే ఉంచవచ్చు), చిన్న చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోవాలి. పాన్ పెట్టుకుని కొద్దిగా నూనె వేసి పల్లీలు, ధనియాలు, జీలకర్ర మరియు ఎండుమిర్చిని దోరగా వేయించి చల్లారనివ్వాలి మిక్సీ జార్‌లో లేదా రోట్లో వేయించిన పదార్థాలు, వెల్లుల్లి, చింతపండు, పసుపు మరియు ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. గ్రైండ్ చేసిన మిశ్రమంలో కోసి పెట్టుకున్న దోసకాయ ముక్కలను వేసి ఒక్కసారి (పల్స్ మోడ్‌లో) తిప్పాలి. ముక్కలు మరీ మెత్తగా అవ్వకుండా కొంచెం కచ్చావచ్చాగా ఉంటేనే రుచి బాగుంటుంది. పాన్‌లో నూనె వేసి ఆవాలు, జీలకర్ర, పప్పులు, ఎండుమిర్చి, ఇంగువ మరియు కరివేపాకు వేసి వేయించాలి. ఈ తాలింపును పచ్చడిలో కలిపితే కమ్మని దోసకాయ పచ్చడి సిద్ధం.

# ఏసీలో మంటలు, పేలుళ్లకు కారణాలు: సింపుల్ మెయింటెనెన్స్






ఈ ఉదయం ఢిల్లీలో ఓ నాలుగంతస్తుల భవనంలో సంభవించిన అగ్నిప్రమాదంలో తొమ్మిది మంది మరణించారు. ఢిల్లీ వివేక్ విహార్ ప్రాంతంలోని ఒక నివాస భవనంలో ఈ అగ్నిప్రమాదం సంభవించింది. దీనికి కారణం ఏసీలో సంభవించిన షార్ట్ సర్క్యూట్ కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనలో తొమ్మిదిమంది మరణించారంటే ఏసీలో సంభవించే పేలుడు, అగ్నిప్రమాదం తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. తేలికపాటి మెయింటెనెన్స్ తో ఏసీలో సంభవించే పేలుళ్లను నివారించవచ్చు. దీని గురించి ఇప్పుడు తెలుసుకుందాం. 2026 అసెంబ్లీ ఎన్నికలు - వన్ ఇండియాలో పూర్తి వివరాలు కంప్రెషర్ వేడెక్కడం: ఏసీ గుండెగా భావించే కంప్రెషర్, వేసవిలో ఎటువంటి విరామం లేకుండా నిరంతరంగా నడిపితే విపరీతంగా వేడెక్కవచ్చు. ధూళితో మూసుకుపోయిన కండెన్సర్ కాయిల్స్ దీని పనితీరును మరింత ప్రభావితం చేస్తాయి. దీనివల్ల ఆ ప్రాంతంలో అధిక వేడి ఏర్పడుతుంది. అది బయటికి వెళ్లడానికి సరైన మార్గం మూసుకుపోతుంది. ఫలితంగా కంప్రెషర్ పగిలిపోయే ప్రమాదం ఉంది. షార్ట్ సర్క్యూట్: నాసిరకం ఎక్స్‌టెన్షన్ కార్డ్‌లు లేదా సరిగా లేని సాకెట్‌లను ఉపయోగించడం వల్ల వైర్లు వేడెక్కడం, ఇన్సులేషన్ కరిగిపోవడం, స్పార్క్ రావడం జరుగుతుంటాయి. ఈ షార్ట్ సర్క్యూట్స్ పక్కనే ఉన్న ప్లాస్టిక్ భాగాలు లేదా త్వరగా మండే స్వభావం గల రిఫ్రిజెరాంట్‌ను మండిస్తాయి. అగ్ని ప్రమాదానికి దారి తీస్తాయి. కూలింగ్ లీకేజీలు: ఆర్ 32 లేదా ఆర్ 290 వంటి మండే స్వభావం గల కూలింగ్ గ్యాస్ లీక్ కావడం అత్యంత ప్రమాదకరం. ఇది మైక్రో లెవెల్ స్పార్క్ ను కూడా సంగ్రహిస్తాయి. తక్షణ అగ్ని ప్రమాదాలు లేదా శక్తివంతమైన పేలుళ్లకు కారణమౌతాయి. ఈ లీకేజీలు గుర్తించడం కష్టం కాబట్టి మరింత జాగ్రత్త అవసరం. హై కంప్రెషర్: ఏసీ సర్వీసింగ్ సమయంలో గ్యాస్ అవసరానికి మించి నింపడం లేదా గాలి, తేమతో కలవడం వంటి సాంకేతిక కారణాల వల్ల సిస్టమ్ లోపల కంప్రెషర్ పెరుగుతుంది. దాని సేఫ్టీ లెవెల్ ను మించి పెరిగితే పైప్‌లు పగిలిపోతాయి. ఫలితంగా ఏసీ మిషన్ మంటలబారిన పడే ప్రమాదం ఉంది. ఏసీ నుండి ఏదైనా కాలిపోతున్న వాసన వస్తే వేడికి లోపలి వైర్లు కరిగిపోతున్నాయని అర్థం. గ్రైండింగ్, హిస్సింగ్ లేదా గడగడమంటూ వింత శబ్దాలు వస్తున్నా, సర్క్యూట్ బ్రేకర్ తరచుగా ట్రిప్ అవుతున్నా అది సర్వీసింగ్ కు వచ్చినట్లే. ఏసీ ఆన్ చేసినప్పుడు ఇంట్లో లైట్లు డిమ్ అయినా కూడా అది ప్రమాదం కిందికే లెక్క. అలాంటప్పుడు వెంటనే ఏసీని ఆఫ్ చేయాలి. దాన్ని రిపేరుకు ఇవ్వాలి. ఏసీ ప్రమాదాలను నివారించడం ఎలా? ఏసీలను నిరంతరాయంగా గంటల తరబడి నడపకూడదు. దానిపై ఒత్తిడిని తగ్గించాలి. దీనికోసం టైమర్ సెట్టింగ్‌లను ఉపయోగించాలి. ఏసీకి కొంత విరామం ఇవ్వడం అవసరం కూడా. దాన్ని ఎక్కువగా వాడుతున్నప్పుడు ప్రతి 10-15 రోజులకు ఒకసారి ఫిల్టర్లను శుభ్రం చేయాలి. ఇలా చేయడం వల్ల ఏసీ సిస్టమ్‌పై ఒత్తిడి తగ్గుతుంది. ఏసీలను నేరుగా ప్రత్యేకమైన, అధిక సామర్థ్యం గల (16ం) సాకెట్‌లోకి ప్లగ్ చేయాలి. ఎక్స్‌టెన్షన్ బోర్డులను అస్సలు ఉపయోగించవద్దు. బయటివైపు సరైన వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలి. ఎటువంటి అడ్డంకులు లేకుండా గాలి ప్రసరణకు వీలు కల్పించాలి. అత్యవసర పరిస్థితుల్లో ఏమి చేయాలి? ఒకవేళ ఏసీకి అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే మెయిన్ ఎంసీబీని ఉపయోగించి విద్యుత్ సరఫరాను నిలిపివేయాలి. ఇంట్లో నుండి వెంటనే బయటికి రావాలి. అగ్నిమాపక విభాగానికి కాల్ చేయాలి. మంటలపై ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని విసరకూడదు. ఎలక్ట్రిక్ మంటలను ఆర్పడానికి డ్రై కెమికల్ (ంఃఅ), అగ్నిమాపక యంత్రాన్ని లేదా ఇసుకను వాడాలి.

# చింత చిగురు పప్పు.. ఇదొక్కటి యాడ్ చేస్తే టేస్ట్ మామూలుగా ఉండదు..!



సమ్మర్ లో చింత చిగురు దొరుకుతుంది. వేసవిలో చికెన్, మటన్ లాంటివి కాకుండా సులభంగా జీర్ణం అయ్యే వంటలను తినేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తుంటారు. అయితే సమ్మర్ లో చింత చిగురుతో పప్పు చేసుకుంటే చాలా అద్భుతంగా ఉంటుంది. చింత చిగురు పప్పు రుచి మాటల్లో వర్ణించలేని విధంగా ఉంటుంది. ఇది చేసుకోవడం కూడా చాలా సులభం. మరి సూపర్ టేస్టీ చింత చిగురు పప్పు తయారీ విధానం ఇక్కడ చూడండి.. కావాల్సిన పదార్థాలు.. తయారీ విధానం.. 2026 అసెంబ్లీ ఎన్నికలు - వన్ ఇండియాలో పూర్తి వివరాలు చింత చిగురు పప్పు తయారీ కోసం కావాల్సిన పదార్థాలు చూస్తే కందిపప్పు ఒక కప్పు, చింత చిగురు అర కప్పు, పసుపు అర టీ స్పూన్, ఉప్పు, కారం రుచికి సరిపడా, పోపు దినుసులు ఒక టేబుల్ స్పూన్, ఇంగువ చిటికెడు, ఎండుమిర్చి రెండు లేదా మూడు, వెల్లుల్లి రేకులు రెండు టేబుల్ స్పూన్ లు, నూనె రెండు టేబుల్ స్పూన్ లు తీసుకోవాలి. ఇప్పుడు చింత చిగురు పప్పు తయారీ విధానం చూస్తే ముందుగా ఒక స్టవ్ ఆన్ చేసి కుక్కర్ లో కందిపప్పు, చింత చిగురు, పసుపు అలాగే తగినన్ని నీళ్లు పోసి మెత్తగా ఉడికించుకోవాలి. ఇప్పుడు ఉడికించుకున్న పప్పును పప్పు గుత్తితో మెత్తగా రుబ్బుకోవాలి. మరిన్ని కనుగొనండి ప్రాంతీయ వార్తలు జ్యోతిష్య సేవలు ఎడ్యుకేషన్ జాబ్స్ క్రీడా వార్తలు రాజకీయ వార్తలు ఆ తర్వాత వేరొక గిన్నె తీసుకోవాలి. అందులో నూనె పోసి వేడి చేయాలి. అందులో పోపు దినుసులు, ఇంగువ, వెల్లుల్లి రేకులు, ఎండు మిర్చి వేసి వేయించుకోవాలి. ఇప్పుడు వేగిన పోపులో రుబ్బిన పప్పు, ఉప్పు, కారం వేసి బాగా కలపాలి. అలా మరో రెండు నుంచి మూడు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. చివరగా ఆ మిశ్రమంలో కొత్తిమీర వేస్తే సరి.. సూపర్ టేస్టీ చింత చిగురు పప్పు రెడీ అయినట్టే.. వేడి వేడి అన్నంలోకి ఈ పప్పు సూపర్ టేస్టీగా ఉంటుంది.

# రాయలసీమ స్పెషల్ 'నాటుకోడి కరివేపాకు వేపుడు'.. ఇలా చేస్తే టెస్ట్ నెక్స్ట్ లెవెల్..!



సండే వచ్చిందంటే చాలు.. చాలామందికి నాన్ వెజ్ తినాలని కోరిక ఉంటుంది. పొద్దుపొద్దునే చికెన్ షాపుల ముందు క్యూ కడుతుంటారు. అయితే ఎప్పుడూ చికెన్ కాకుండా ఈ సారి నాటుకోడి ట్రై చేయండి.. అది కూడా ఆంధ్రా స్టైల్ లో.. మరి రాయలసీమ స్పెషల్ నాటుకోడి వేపుడు తయారీ ఎలా..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? ఈజీగా ఇంట్లోనే ఎలా తయారు చేసుకోవాలి..? ఇక్కడ చూద్దాం.. 2026 అసెంబ్లీ ఎన్నికలు - వన్ ఇండియాలో పూర్తి వివరాలు రాయలసీమ స్పెషల్ నాటుకోడి కరివేపాకు వేపుడు తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. నాటుకోడి ముక్కలు ఒక కిలో, కరివేపాకు ఒక కప్పు( సగం వేపుడు కోసం, సగం తాళింపు కోసం), అల్లం వెల్లుల్లి పేస్టు 2 టేబుల్ స్పూన్ లు, నూనె నాలుగు నుంచి ఐదు టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయలు రెండు పెద్దవి, ఎండుమిర్చి ఆరు నుంచి ఎనిమిది, పచ్చిమిర్చి నాలుగు నుంచి ఐదు, ఉప్పు రుచికి సరిపడా, పసుపు పొడి ఒక టేబుల్ స్పూన్, ధనియాల పొడి రెండు టేబుల్ స్పూన్ లు, గరం మసాలా పొడి, కారం పొడి రెండు టేబుల్ స్పూన్ లు తీసుకోవాలి. ఇప్పుడు రాయలసీమ స్పెషల్ నాటుకోడి కరివేపాకు వేపుడు తయారీ విధానం చూస్తే.. ముందుగా నాటుకోడి ముక్కలను శుభ్రం చేసుకోవాలి. వాటిని ఒక పాత్రలోకి తీసకోవాలి. ఇప్పుడు అందులో ఉప్పు, పసుపు వేసి కొన్ని నీళ్లు పోయాలి. అలా ఉడికించుకోవాలి. ఇప్పుడు ఒక బాణలిలో కొన్ని కరివేపాకు ఆకులను నూనె లేకుండా పొడిగా వేయించుకోవాలి. దీన్ని చివర్లో పొడి చేయాల్సి ఉంటుంది. ఇక అదే బాణలిలో తగినంత నూనె పోయాలి. నూనె వేడెక్కిన తర్వాత జీలకర్ర, ఎండుమిర్చి అలాగే మిగిలిన కరివేపాకు ఆకులను వేసి తాళింపు పెట్టుకోవాలి. మరిన్ని కనుగొనండి ఆ తర్వాత ఆ మిశ్రమంలో ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి వేసి దోరగా వేయించుకోవాలి. ఇప్పుడు అందులోనే అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేంత వరకూ వేయించాలి. ఇప్పుడు వేసి బాగా కలుపుకోవాలి. అందులోనే ధనియాల పొడి, మిరియాల పొడి, గరం మసాలా పొడి, కారం పొడి వేసుకోవాలి. అలా వేపుడు బాగా ఎర్రగా అయ్యేంత వరకూ వేయించుకోవాలి. చివరగా అందులో వేయించి పొడి చేసుకుని పెట్టుకున్న కరివేపాకు పొడిని వేయాలి. ఇప్పుడు మొత్తం ఓసారి కలిపి దింపుకోవడమే.. అంతే సూపర్ టేస్టీ రాయలసీమ స్పెషల్ నాటుకోడి కరివేపాకు వేపుడు కర్రీ రెడీ అయినట్టే..

## "కోడిగుడ్డు పకోడీ" ఎప్పుడైనా ట్రై చేశారా..?

కోడిగుడ్డు.. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఎంతో ఇష్టంగా తింటుంటారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యాన్ని అందించే వనరు కావడమే దీని ప్రత్యేకత. కేవలం రుచికే కాకుండా, శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలను అందించడంలో గుడ్డును మించిన ఆహారం లేదని చెప్పవచ్చు. ఇది ఆరోగ్యానికి మేలు చేయడమే.. కాకుండా ఎక్కువగా ఇష్టపడే ఆహారంగా గుర్తింపు పొందింది. కాగా అత్యంత పోషక విలువలతో కూడిన సంపూర్ణ ఆహారంగా కూడా గుడ్డు పరిగణించబడుతుంది. దీని వల్ల ప్రోటీన్, విటమిన్ ం, ఆ, ఇ, ః12, ఫోలేట్, సెలీనియం వంటి ముఖ్యమైన పోషకాలు శరీరానికి అందుతాయి. 2026 అసెంబ్లీ ఎన్నికలు - వన్ ఇండియాలో పూర్తి వివరాలు గుడ్డు తినడం వల్ల శక్తి పెరుగుతుంది, కండరాలు బలపడతాయి, రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. అంతే కాకుండా భారతదేశంలో గుడ్డుతో చేసే వంటకాలకు విశేష ప్రాధాన్యం ఉంది. అయితే ఈ సమ్మర్ సీజన్ లో వేడివేడిగా టీతో కలిసి తినడానికి, సాయంత్రాల్లో ఆస్వాదించడానికి అద్భుతమైన స్నాక్ అంటే కరకరలాడే "కోడిగుడ్డు పకోడీ" అనే చెప్పాలి. బయట క్రిస్పీగా, లోపల సాఫ్ట్‌గా ఉండే ఈ వంటకం చాలా తక్కువ సమయంలో సింపుల్ పదార్థాలతో తయారవుతుంది. ఇప్పుడు దీనిని మరింత రుచిగా, ప్రొఫెషనల్ రెసిపీ స్టైల్‌లో ఎలా చేయాలో చూద్దాం. మరిన్ని కనుగొనండి పిండి ానిజీఇఎబ పిండిలో ఫ్లోర్ వణణబ గుడ్డు స్నాక్ కావలసిన పదార్థాలు: ఉడికించిన కోడిగుడ్లు - 3 నుంచి 4 శనగపిండి - 1/2 కప్పు బియ్యం పిండి / కార్న్ ఫ్లోర్ - 1 టేబుల్ స్పూన్ ఉల్లిపాయలు (సన్నగా తరిగినవి) - 1/2 కప్పు పచ్చిమిర్చి (తరిగినవి) - 2 నుంచి 3 అల్లం (తరిగినది) - 1 టీస్పూన్ కారం - 1 టీస్పూన్ (రుచికి తగ్గట్టు) పసుపు - చిటికెడు గరం మసాలా - 1/2 టీస్పూన్ ఉప్పు - తగినంత కొత్తిమీర, కరివేపాకు - కొద్దిగా నూనె - డీప్ ఫ్రై కోసం సరిపడా తయారీ విధానం: ఉడికించిన గుడ్ల పెంకులు తీసి, చిన్న ముక్కలుగా కోయాలి. (ఇష్టం ఉంటే పచ్చసొన తీసేసి కేవలం తెల్లసొనతో కూడా చేయవచ్చు) ఒక పెద్ద బౌల్‌లో శనగపిండి, బియ్యం పిండి/కార్న్ ఫ్లోర్, కారం, పసుపు, ఉప్పు, గరం మసాలా, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయలు, కొత్తిమీర, కరివేపాకు వేసి బాగా కలపాలి. ంటలవతీబితిబవఎవనిబి ఖనీలివతీవట ఎఎ: 00:00 ఇప్పుడు గుడ్డు ముక్కలను ఈ మిశ్రమంలో వేసి, కొద్దిగా నీళ్లు చిలకరించి గట్టిగా కలుపుకోవాలి. (పిండిమిశ్రమం చాలా పల్చగా కాకుండా జాగ్రత్త) కడాయిలో నూనె వేడి చేసి, మిశ్రమాన్ని చిన్న చిన్న పకోడీలలా నూనెలో వేయాలి. మీడియం మంటపై గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చే వరకు వేయించాలి. కరకరలాడే పకోడీలను టిష్యూపేపర్‌పై తీసి అదనపు నూనె తొలగించి, టమాటో సాస్ లేదా పచ్చి చట్నీతో వేడిగా సర్వ్ చేయాలి.

# "బంగాళదుంప?మిల్ మేకర్ ఫ్రై" నెక్స్ట్ లెవెల్ టేస్ట్ ..?

బంగాళదుంపతో చేసే వంటకాలు అంటే పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ చాలా ఇష్టం. ఫ్రైగా చేసినా, కూరగా వండినా, కుర్మాగా చేసినా... ఏ రూపంలో చేసినా బంగాళదుంప రుచి ప్రత్యేకంగా ఉంటుంది. బిర్యానీ, పులావ్, చపాతీ, రోటీ, అన్నం-ఏ వంటకంతో కలిపినా ఇది అద్భుతంగా సరిపోతుంది. అలాంటి రుచికరమైన వంటకాలలో ఒకటి బంగాళదుంప-మిల్ మేకర్ ఫ్రై. 2026 అసెంబ్లీ ఎన్నికలు - వన్ ఇండియాలో పూర్తి వివరాలు మిల్ మేకర్ లేదా ానీఎజీ ఇష్ట్రబీనినిబతో చేసే ఈఫ్రై ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల ఇది పోషకాహారంగా కూడా భావిస్తారు. ఉల్లిపాయలు, టమోటాలు, మసాలా దినుసులతో తయారయ్యే ఈ ఫ్రై చికెన్ లేదా మటన్ కి మంచి శాఖాహార ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు. అన్నం, రోటీ, పులావ్, నాన్ లేదా చపాతీతో ఈ ఫ్రై ఎంతో రుచిగా ఉంటుంది. ఈ టేస్టీ టేస్టీ ఫ్రై ఎలా చేయాలో మీకోసం ప్రత్యేకంగా.. మరిన్ని కనుగొనండి ప్రాంతీయ వార్తలు క్రీడా వార్తలు ుఎ డ ఎతిటవనీ ట్రావెల్ గైడ్స్ అంతర్జాతీయ వార్తలు బ్రేకింగ్ న్యూస్ అలర్ట్స్ కావలసిన పదార్థాలు.. మిల్ మేకర్ (సోయా చంక్స్) - 1 కప్పు బంగాళదుంపలు - 1 నుంచి 2 (మధ్యస్థ పరిమాణం, ముక్కలుగా కోసినవి) ఉల్లిపాయ - 1 (సన్నగా తరిగినది) టమోటాలు - 2 (పేస్ట్ లేదా సన్నగా తరిగినవి) అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్ కారం పొడి - 1 నుంచి 2 టీస్పూన్లు పసుపు - అర టీస్పూన్ ధనియాల పొడి - 1 టీస్పూన్ గరం మసాలా - అర టీస్పూన్ ఉప్పు - రుచికి సరిపడా నూనె - 2 టేబుల్ స్పూన్లు పోపు దినుసులు - ఆవాలు, జీలకర్ర, బిర్యానీ ఆకు, చెక్క కొత్తిమీర - కొద్దిగా (అలంకరణ కోసం. ఒక పాత్రలో వేడి నీరు తీసుకుని అందులో సోయా చంక్స్‌ను 10 నుంచి 15 నిమిషాలు నానబెట్టాలి. తర్వాత వాటిని బాగా పిండి అదనపు నీటిని తీసివేసి పక్కన పెట్టుకోవాలి. తర్వాత బాణలిలో నూనె వేసి వేడి చేయాలి. నూనె వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, బిర్యానీ ఆకు, చెక్క వంటి పోపు దినుసులు వేసి వేయించాలి. తరువాత సన్నగా తరిగిన ఉల్లిపాయలను వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ఉల్లిపాయలు బాగా వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి కొద్దిసేపు వేపాలి. ఇప్పుడు టమోటా పేస్ట్ లేదా తరిగిన టమోటాలు వేసి కలపాలి. తరువాత పసుపు, కారం పొడి, ధనియాల పొడి, ఉప్పు వేసి మసాలా బాగా కలిసే వరకు ఉడికించాలి. మసాలా నుండి నూనె పైకి తేలే వరకు వేయిస్తే కూరకు మంచి రుచి వస్తుంది. తర్వాత బంగాళదుంప ముక్కలు, నానబెట్టిన మిల్ మేకర్ వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీరు పోసి మూత పెట్టి 10 నుంచి 15 నిమిషాల వరకు బంగాళదుంపలు మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. చివరిగా గరం మసాలా చల్లి కలపాలి. కొత్తిమీర తరిగి పై నుంచి చల్లాలి. కూర కొద్దిగా మందంగా అయ్యే వరకు ఇంకొంచెం ఉడికించి స్టౌ ఆఫ్ చేయాలి.



# స్పోర్ట్స్ న్యూస్

## ఈ రూల్ ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావట్లేదు..

### ఐపీఎల్‌లో గర్ల్‌ఫ్రెండ్ కల్చర్‌పై బీసీసీఐ అసంతృప్తి!



ఐపీఎల్ 2026 ఉత్సాహభరితంగా కొనసాగుతోంది. టోర్నీలో ఇప్పటికే సగానికి పైగా మ్యాచ్‌లు ముగిశాయి. అయితే ఈ సీజన్‌లో కొందరు ప్లేయర్లు తమ గర్ల్‌ఫ్రెండ్స్‌తో చక్కర్లు కొడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. హార్దిక్ పాండ్య, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్, అర్ష్‌దీప్ సింగ్.. లాంటి ఆటగాళ్లు తమ స్నేహితురాళ్లతో ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో ప్రయాణిస్తున్నారు. దీనిపై బీసీసీఐ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. కొంతమంది ఆటగాళ్ల భాగస్వాములు 'ఇన్‌ఫ్లుయెన్సర్' హోదా కలిగి ఉన్నారు. వీరిలో కొందరు గతంలో తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినట్లు తెలుస్తోంది. ఇదే కాకుండా, కొందరికి తమ స్నేహితురాళ్లతో విభేదాలు తలెత్తి పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. దీనివల్ల ఐపీఎల్‌తో పాటు బీసీసీఐ ప్రతిష్ఠకు కూడా ఇబ్బంది ఎదురవుతుందని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ గర్ల్‌ఫ్రెండ్ కల్చర్‌పై బీసీసీఐ అధికారిక ప్రతినిధి ఒకరు స్పందించారు.'ఇప్పుడు ఈ గర్ల్‌ఫ్రెండ్ సంస్కృతికి అడ్డుకట్ట వేయకపోతే.. మున్ముందు ఇది మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. జట్టు బస్సులో క్రీడాకారులు తమ స్నేహితురాళ్ల కోసం వేచి ఉండే సందర్భాలనూ మేం గమనించాం. క్రికెటర్లతోపాటు వారు కూడా ఒకే హోటల్‌లో బస చేస్తున్నారు. ప్లేయర్లు అధికారికంగా తమ భాగస్వాములను ప్రకటించడంతో కొందరు యాంటీ కరప్షన్ యూనిట్ అధికారులు అనుమతి ఇస్తున్నట్లు మాకు సమాచారం అందింది. అయితే ఇలాంటి 'అఫీషియల్ గర్ల్‌ఫ్రెండ్' రూల్ ఉన్నట్టుండి ఎక్కడ నుంచి వచ్చిందో అర్థం కావడం లేదు. బీసీసీఐ పాలసీలో ఇలాంటి వాటికి చోటు లేదు. కొన్ని పరిమితుల మధ్య భార్య, కుటుంబసభ్యులను మాత్రమే అనుమతిస్తున్నాం. గర్ల్‌ఫ్రెండ్స్ వ్యవహారంపై విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది' అని బీసీసీఐ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

## ఓడిపోయే మ్యాచ్ గెలవడానికి అతడే కారణం: శుభ్‌మన్ గిల్



ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న (ఆదివారం) అహ్మదాబాద్ వేదికగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. వాషింగ్టన్ సుందర్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. వాషింగ్టన్ అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతోనే విజయం సాధించామని అన్నాడు. అతను లేకుంటే ఈ మ్యాచ్‌లో ఓడిపోయేవాళ్లమని గిల్ తెలిపాడు.శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. 'పిచ్ బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉంది. సెట్ అయిన బ్యాటర్ ఆఖరి వరకు ఆడాలని అనుకున్నాము. ఆ బాధ్యతను వాషింగ్టన్ సుందర్ నిర్వర్తించాడు. ఇలాంటి ఛేజింగ్‌ల్లో మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లకుండా ముందే ముగించాలి. ఇది 15 నుంచి16 ఓవర్ల మధ్యలో ఛేజ్ చేసే రకమైన పిచ్ కాదు. కాబట్టి మ్యాచ్‌ను ఒకటి లేదా రెండు ఓవర్ల ముందే ముగించాలని మేం అనుకున్నాం' అని గిల్ తెలిపాడు.'ఇతర పిచ్‌ల లాగా ఇక్కడ లెంగ్త్ బంతులు బ్యాటింగ్‌కు అనుకూలంగా రాలేదు. అందుకే కుదురుకున్న బ్యాటర్ క్రీజులో ఉండటం చాలా కీలకంగా మారింది. మా జట్టులో వాషింగ్టన్ సుందర్ ఆ పని చేశాడు. ఆఖరి వరకు క్రీజులో ఉండి మ్యాచ్‌ను ముగించాడు. పరిస్థితులకు తగ్గట్లే బ్యాటర్లను పంపించాం. రైట్ హ్యాండర్స్, లెఫ్టాండ్స్ అనే విషయాన్ని పట్టించుకోలేదు 'అని గిల్ వెల్లడించాడు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 163 పరుగులు చేసింది. అనంతరం గుజరాత్ టైటాన్స్ 19.5 ఓవర్లలో 6 వికెట్లకు 167 పరుగులు చేసి గెలుపొందింది. గుజరాత్‌కు ఇది వరుసగా మూడో విజయం కాగా.. పంజాబ్ కింగ్స్‌కు రెండో పరాజయం.

## టెన్షన్ వద్దు.. మూడు ఫార్మాట్లు ఆడుతాను: బాబర్ ఆజామ్

పాకిస్థాన్ తరఫున మూడు ఫార్మాట్లు ఆడుతానని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్ స్పష్టం చేశాడు. ఈ విషయంలో సందేహం అక్కర్లేదన్నాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) 2026 సీజన్‌లో తాను సారథ్యం వహించిన పెషావర్ జల్మీ టీమ్‌ను బాబర్ ఆజామ్ విజేతగా నిలబెట్టాడు. ఈ టోర్నీలో బాబర్ ఆజామ్ 588 పరుగులతో సత్తా చాటాడు.గత కొద్ది రోజులుగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడిన బాబర్ ఆజామ్.. పీఎస్ఎల్‌తో టచ్‌లోకి వచ్చాడు. ఒకప్పుడు కోహ్లీతో పోటీపడిన బాబర్ ఆజామ్.. ఫామ్ కోల్పోయి పాకిస్థాన్ జట్టులో చోటు కూడా కోల్పోయాడు. అయినా పట్టువదలని బాబర్ ఆజామ్.. పీఎస్ఎల్‌లో సత్తా చాటి పాకిస్థాన్ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు.పీఎస్ఎల్ 2026 సీజన్ విజయానంతరం మీడియాతో మాట్లాడిన బాబర్ ఆజామ్.. ఏ ఫార్మాట్‌లకు ప్రాధాన్యత ఇస్తారని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. 'టెన్షన్ వద్దు. మూడు ఫార్మాట్లు ఆడుతాను.'అని బాబర్ ఆజామ్ స్పష్టం చేశాడు. క్రికెటర్లు ఫార్మాట్‌లను ఎంచుకోవద్దని అభిప్రాయపడ్డాడు.ప్రతీ ప్లేయర్ మూడు ఫార్మాట్లు ఆడాలని, అలా చేయడం వల్ల వారి సామర్థ్యాలు మెరుగుపడుతాయని తెలిపాడు. 'ఆటగాడు కేవలం ఆడటానికే. ప్రతి ఒక్కరూ అన్ని ఫార్మాట్‌లు ఆడాలి,





టీ20లు, వైట్ బాల్‌కే పరిమితం కాకూడదు. రెడ్ బాల్ క్రికెట్ అపారమైన అనుభవాన్ని, ఇన్నింగ్స్ నిర్మాణం, సహనాన్ని అందిస్తుంది. దేశవాళీ నాలుగు రోజుల క్రికెట్ భారీ ఇన్నింగ్స్‌లు ఆడే అనుభవం ఇస్తుంది.ఒక ఫార్మాట్ ఆడటం వల్ల మరొక ఫార్మాట్‌కు సహాయపడుతుంది .రెడ్ బాల్ గేమ్ టీ20లు, వన్డేల్లో మేలు చేస్తుంది. టెస్ట్ మ్యాచ్‌ల్లో పెంపొందించుకునే సహనం, మానసిక స్థితి వైట్-బాల్ క్రికెట్‌లో ఉపయోగపడుతుంది. గత కొద్ది రోజులుగా బ్యాటింగ్‌లో నాపై పెట్టుకున్న అంచనాలను అందుకోలేకపోయాను. ఇలా జరగడం మామూలే. కొన్నిసార్లు ప్రణాళికలు సరిగ్గా అమలు కావు. మీరు ఎంత ప్రయత్నించినా.. కొన్ని విషయాలు మీకు అనుకూలంగా ఉండవు.ఇలాంటి పరిస్థితుల్లో రెండు అడుగులు వెనక్కి వేసి, స్వీయ విశ్లేషణ చేసుకోవాలన్నాడు. తప్పులను విశ్లేషించి వాటిని సరిదిద్దుకోవాలి. నేను అదే చేశాను. నా సన్నిహితులు అపారమైన మద్దతు ఇచ్చారు. నా కుటుంబం, స్నేహితులు నన్ను ప్రోత్సహించారు. కోచ్‌లతో మాట్లాడి, నా ఆటను మెరుగుపర్చుకున్నాను.ప్రపంచకప్ నుంచి వచ్చాక సరిగ్గా రాణించలేకపోయాను. చాలా నిరుత్సాహానికి లోనయ్యాను. పీఎస్ఎల్‌కు పది రోజులు మాత్రమే సమయం ఉండగా.. నా తప్పులు, గేమ్ ప్లాన్ మార్పులను పరిశీలించుకున్నాను. నా టెక్నిక్, మానసిక స్థితిపై పనిచేశాను. నేను నా సహజమైన ఆటను ఆడుతాను. నా క్రికెటింగ్ షాట్స్‌కు కట్టుబడి ఉంటాను. పిచ్, మ్యాచ్ పరిస్థితి, జట్టు డిమాండ్ ఏదైతే.. దాన్ని అమలు చేయాలని నిర్ణయించుకున్నా'అని బాబర్ ఆజామ్ ముగించాడు.

## స్వదేశానికి ఆర్సీబీ ఓపెనర్.. కోహ్లీ జోడీ అతడేనా..!



పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరువైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కీలక బ్యాటర్ సేవల్ని కోల్పోయింది. ధనాధన్ ఆటతో శుభారంభాలు ఇచ్చే ఓపెనర్ ఫిల్ సాల్ట్ అనూహ్యంగా స్వదేశానికి పయనమయ్యాడు. వరసగా మూడు మ్యాచ్‌లకు దూరమైన సాల్ట్ గాయంతో బాధ పడుతుండడమే అందుకు కారణం. మెరుగైన చికిత్స కోసం ఈ డాషింగ్ బ్యాటర్ ఇంగ్లండ్‌కు వెళ్లాడు. దాంతో.. అతడు తిరిగి ఎప్పుడు ఆర్సీబీ స్క్వాడ్‌లో కలుస్తాడు? అనేది తెలియడం లేదు.టాపార్డర్‌లో దంచికొడుతూ ఆర్సీబీ విజయాల్లో కీలకమైన ఫిల్ సాల్ట్ ఐపీఎల్‌కు దూరమయ్యాడు. వేలి గాయంతో బాధ పడుతున్న సాల్ట్ స్వదేశం వెళ్లాడు. అక్కడ స్కానింగ్ పరీక్షలు చేయించుకొని కోలుకున్నాక తిరిగొచ్చే అవకాశముంది. ఏప్రిల్ 18న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ అనంతరం సాల్ట్ మైదానంలోకి దిగలేదు. దాంతో.. సాల్ట్‌కు ఏమైంది? అని అభిమానులు ఆందోళన చెందారు. వారు భయపడినట్టే ఈ విధ్వంసక ప్లేయర్ సీజన్ మధ్యలోనే స్వదేశం బాట పట్టాడు.సాల్ట్ గైర్హాజరీలో విరాట్ కోహ్లీ జతగా కుర్రాడు జాకబ్ బెథెల్ఇన్నింగ్స్ ఆరంభించడం ఖాయమైనట్టే. దూకుడైన ఆటతో ప్రత్యర్థి బౌలర్లను భయపెట్టే సాల్ట్ అందుబాటులో లేకపోవడంతో చురుకైన ఫీల్డర్‌ను కూడా బెంగళూరు కోల్పో?యింది. 18వ సీజన్‌లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించిన సాల్ట్.. 19వ ఎడిషన్‌లోనూ దంచేశాడు. కేవలం ఆరు ఇన్నింగ్స్‌ల్లోనే 168.33 స్ట్రయిక్ రేటుతో 202 రన్స్ సాధించాడు. ప్రస్తుతం రెండో స్థానంలో కొనసాగుతున్న ఆర్సీబీ మే 7న లక్నో? సూపర్ జెయింట్స్‌ను ఢీ కొట్టనుంది.


## మిడిల్ ఆర్డర్‌పై వస్తోన్న విమర్శలకు సుందర్ చెక్ పెట్టాడు: అశ్విన్




ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ వరుస విజయాలతో దూసుకెళుతుంది. అద్భుత ప్రదర్శనలతో అగ్రస్థానంలో ఉన్న జట్లను జట్లను ఓడించి ఔరా అనిపించింది. ఆదివారం పంజాబ్ కింగ్స్‌పై 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. 19.5వ బంతికి వాషింగ్టన్ సుందర్ సిక్సర్ బాది జట్టును గెలిపించాడు. దీంతో గుజరాత్.. పదింట్లో ఆరు మ్యాచులు గెలిచి పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. అయితే ఈ మ్యాచ్‌లో వాషింగ్టన్ సుందర్ ఐదో స్థానంలో క్రీజులోకి వచ్చి 23 బంతుల్లో 40 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతడి అద్భుత ప్రదర్శనతో జట్టు ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచాడు. ఈ నేపథ్యంలో సుందర్ ఆటతీరును టీమిండియా మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసించాడు.'గుజరాత్ టైటాన్స్ అద్భుత ప్రదర్శనలు చేస్తోంది. టాప్‌లో ఉన్న రెండు జట్లను వెనువెంటనే ఓడించడం అంత సులువైన విషయం కాదు. గుజరాత్ మిడిల్ ఆర్డర్‌పై కొద్ది రోజులుగా విమర్శలు వస్తూనే ఉన్నాయి. ఆ విమర్శలకు, సందేహాలకు తన నాక్‌తో సుందర్ చెక్ పెట్టాడు. ఐదో స్థానంలో క్రీజులోకి వచ్చి కీలక సమయంలో పుంజుకున్నాడు. ఒత్తిడిని చక్కగా హ్యాండిల్ చేసి మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. దీంతో అతడిపై మేనేజ్‌మెంట్‌కు కూడా నమ్మకం కలుగుతుంది. గుజరాత్ టైటాన్స్ జట్టు టాపార్డర్ పైనే ఎక్కువగా ఆధారపడుతుందన్న విమర్శలకు సుందర్ ఇన్నింగ్స్ సమాధానం. సుందర్‌కు పరిస్థితులకు తగ్గట్టు బ్యాటింగ్ ఇస్తుంటారు. కానీ అతడు ఈ పంజాబ్‌పై బాధ్యత తీసుకుని కూల్‌గా గుజరాత్‌ను గెలిపించాడు' అని అశ్విన్.. సుందర్‌ను ప్రశంసించాడు.

## ఆర్సీబీకి బిగ్ షాక్.. ఇంగ్లండ్‌కు స్టార్ ఓపెనర్ ఫిల్ సాల్ట్

ఐపీఎల్ 2026లో అద్భుత ప్రదర్శనలో రాణిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు కీలక సమయంలో బిగ్ షాక్ తగిలింది. గాయం కారణంగా గత మూడు మ్యాచ్‌ల నుంచి ఆటకు దూరంగా ఉన్న స్టార్ ఓపెనర్ ఫిల్ సాల్ట్.. తాజాగా ఇంగ్లండ్‌కు వెళ్లాడు. గాయానికి సంబంధించిన టెస్టు కోసం తన స్వదేశానికి చేరుకున్నాడు. స్కానింగ్ తీసిన అనంతరం పరిస్థితిని బట్టి ఆర్సీబీ జట్టుతో చేరనున్నట్లు తెలుస్తోంది. శస్త్రచికిత్స అవసరమైతే మాత్రం ఈ లీగ్ నుంచి వైదొలిగినట్లే. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ సందర్భంగా సాల్ట్ వేలికి గాయమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఫిల్ సాల్ట్ స్థానంలో జాకబ్ బెథెల్ ఓపెనర్‌గా వస్తున్న సంగతి తెలిసిందే.ఫిల్ సాల్ట్ ఓపెనర్‌గా దూకుడైన ఆటతీరుతో పరుగులు చేస్తాడు. ఈ సీజన్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడి 202 పరుగులు చేశాడు. విరాట్ కోహ్లీతో కలిసి ఆర్సీబీ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు ప్లే ఆఫ్స్ బెర్తుల కోసం తీవ్రమైన పోటీ ఉన్న సమయంలో ఆర్సీబీ కీలక ప్లేయర్ సాల్ట్ లేకపోవడం పెద్ద ఎదురుదెబ్బేనని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సాల్ట్ స్థానంలో ఆడుతున్న బెథెల్.. పెద్దగా ప్రభావం చూపించడం లేదు. గత మూడు మ్యాచుల్లో 39 పరుగులు మాత్రమే చేశాడు. ఇదిలా ఉండగా, ఈ సీజన్‌లో తొమ్మిది మ్యాచ్‌లు ఆడిన ఆర్సీబీ ఆరింట్లో గెలిచి పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. తన తదుపరి మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మే 7న తలపడనుంది.






# ఆస్కార్ అవార్డుల్లో సరికొత్త నిబంధనలు

## టాలెంట్‌ను ప్రోత్సహించే విధంగా మార్పులు




ప్రపంచ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డుల 99వ ఎడిషన్ కోసం అకాడమీ సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. 2027 ఆస్కార్ అవార్డులకు సంబంధించి అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ యాక్టింగ్, అంతర్జాతీయ సినిమాలు, సాంకేతిక విభాగాల్లో కీలక మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒకే నటుడు ఒకే జాబితాలో రెండు వేరువేరు సినిమాలకు నామినేట్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకూ నటీనటులు ఒక విభాగంలో ఒక సినిమాకు మాత్రమే నామినేట్ అయ్యే అవకాశం ఉండేది. దీనివల్ల టాలెంట్ ఉన్న నటులు ఒకే ఏడాది ఎన్ని చిత్రాల్లో గొప్ప ప్రదర్శనలు ఇచ్చినా, ఏదో ఒకదానితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇకపై ఈ నిబంధనను తొలగించి ఎన్ని సినిమాలకు అయినా నామినేట్ చేసుకునే అవకాశాన్ని అకాడమీ కల్పించింది. అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో కూడా అకాడమీ కీలక మార్పులు చేసింది. ఒక దేశం నుంచి ఇప్పుడు ఒకటి కంటే ఎక్కువ సినిమాలు నామినేషన్లకు అర్హత సాధించొచ్చు. అలాగే, కేన్స్ లాంటి ప్రముఖ అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల్లో అగ్ర పురస్కారాలు అందుకున్న సినిమాలు నేరుగా ఆస్కార్ బరిలో పోటీపడే అవకాశాన్ని కూడా అకాడమీ కల్పించింది. మరోవైపు అంతర్జాతీయ సినిమా కేటగిరీలో ట్రోఫీపై దేశం పేరుతో పాటు దర్శకుడి పేరును కూడా ముద్రించనున్నారు. సినిమా రంగంలో పెరుగుతున్న కృత్రిమ మేధ వినియోగంపై అకాడమీ కఠిన నిర్ణయం తీసుకుంది. రైటింగ్ (స్క్రీన్‌ప్లే) విభాగంలో రచయితలు రాసిన కథలను మాత్రమే వరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. ఏఐ సహాయంతో రాసిన వాటిని అనుమతించబోమని వెల్లడించింది. యాక్టింగ్‌లో కూడా కృత్రిమ మేధతో సృష్టించిన సీన్స్, మార్పులు చేసిన ప్రదర్శనలను అంగీకరించబోమని స్పష్టం చేసింది (ంఇజీటపా ఃజీనిబ ంఎ). నటీనటులు నేరుగా చేసిన ప్రదర్శనలకే అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈ నిబంధనలు అమలుకానున్నాయి. 99వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 14న లాస్ ఏంజెలెస్‌లో ఘనంగా జరగనుంది.

# పృథ్వీరాజన్ సుకుమారన్...ఐ నోబడీ

మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఐ, నోబడీ.. 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే, సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుండి తనను తాను కాపాడుకుంటూనే, తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. ప్రతి సన్నివేశాన్ని తన మ్యూజిక్‌తో ఆయన ఎంతో ఉత్కంఠభరితంగా మలిచారు.






# వారణాసి కోసం జర్మనీలో మహేశ్‌బాబు



రాజమౌళి – మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మహేశ్ బాబు జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ లో ఉన్నారు. అక్కడ ఆయన ఫిట్‌నెస్, వెల్‌నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలను మహేశ్ స్వయంగా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ వారణాసి కోసం సిద్ధమవుతున్నట్లు క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గ్లోబల్ ప్రేక్షకులను ఆకర్షించడమే లక్ష్యంగా రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాలతో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.





# జూన్ 26న లెనిన్ విడుదల




'ఏజెంట్'వంటి డిజాస్టర్ తర్వాత 'లెనిన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు అఖిల్ అక్కినేని. ఇటీవల ఈ చిత్రం గురించి కింగ్ నాగార్జున పాజిటివ్‌గా స్పందించడంతో.. అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇది అఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రమవుతుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. అయితే లెనిన్ సినిమా విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ఇప్పుడు తెరపడింది. లెనిన్ వాయిదా పడుతందనే వార్తలు వచ్చినప్పటికీ.. తాజాగా పరిస్థితులు అనుకూలించాయి. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాను జూన్ 4న విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో ఎలాంటి పోటీ లేకుండా జూన్ 26న 'లెనిన్' సోలోగా బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు మార్గం సుగమమైంది. ఇతర పెద్ద సినిమాల పోటీ లేకపోవడం లెనిన్‌కు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఫ్యాన్స్ నుంచి డబ్బులు గుంజడం సరికాదు

## దర్శకుడు రవిబాబు సంచలన కామెంట్స్

వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రవిబాబు, సినిమా టికెట్ల ధరలు, ఫ్యాన్స్ షోల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన స్వీయ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం రేజర్ . ఈ చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు రవిబాబు. అయితే ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ డే ఫస్ట్ షోకి టాలీవుడ్‌లో టికెట్‌రేట్లు పెంచడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమా విడుదలైన మొదటి రోజు థియేటర్లకు వచ్చే ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు వసూలు చేయడం చాలా తప్పని తెలిపిన రవిబాబు మొదటి రోజు అభిమానులకు సినిమాను ఉచితంగా చూపించాలని అన్నారు. అభిమాన హీరో సినిమాను భుజాన వేసుకుని మోసేది వారే. అటువంటి వారిపై అదనపు భారం వేయడం సరికాదు అంటూ రవిబాబు అభిప్రాయవడ్డారు. ఈ సందర్భంగా పెద్ద సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరలు పెంచడం వల్ల సామాన్య అభిమానులు ఇబ్బంది పడుతున్నారని, దీనిని మార్చాలని ఆయన సూచించారు.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**